సంపూర్ణ నీతిచంద్రిక

[ద్వితీయ భాగము]

234

విగ్రహాము - సంధి

ACC NO. 21207

విద్వాన్ బులుసు సీతారామశాస్త్రి

పబ్లిషర్సు: అద్దేపల్లి అండ్ కో
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

అన్నిహక్కులు
ప్రకాశకులవి

ప్రథమ ముద్రణము
1955

ACC No. 21207.

ఒక రూపాయి

విషయసూచిక

పుట

విగ్రహము :

1.	హిరణ్యగర్భుని వృత్తాంతము	1
2.	వానరములకుఁ బోధచేసి చెడిన పక్షుల కథ	3
3.	వాగ్దోషము వలనఁ జెడిన గాడిద కథ	5
4.	చంద్రుని పేరుచెప్పుకొని మేలొందిన కుందేళ్ళ కథ	7
5.	దీర్ఘముఖుఁడు చిత్రవర్ణుని దర్శించుట	10
6.	కాక స్నేహమున మరణించిన హంస కథ	12
7.	కాక స్నేహమువలనఁ జనిపోయిన వర్తకపక్షి కథ	13
8.	చిలుక రాయబారము	15
9.	హిరణ్యగర్భుడు మేఘవర్ణుని గొలువునఁ జేర్చుకొనుట	19
10.	ఆత్మపక్షము విడిచి పరపక్షముఁ జేరి మరణించిన నక్క కథ	19
11.	చోర బ్రహ్మరాక్షసులు కలహించుకొని యింటి యజమానునకు మేలు చేసిన కథ	25
12.	నూతనాగంతకుని నమ్మి చెడిన మందవిసర్పిణి కథ	29
13.	వీరవరుఁడు తన కుమారుని ప్రాణము లొసఁగి శూద్రకమహారాజును గాపాడఁ బోయిన కథ	32
14.	క్షపణకులను గొట్టి నిధులు పొందిన క్షత్రియుని గాథ	37
15.	భిక్షుకులను గొట్టి యురితీయబడిన మంగలి కథ	38
16.	యుద్ధము	45
17.	మేఘవర్ణుని మోసము	46
18.	సారసపక్షి స్వామి భక్తి	46

సంధి :

1. హితవాక్యములు వినక చెడిన కూర్మము కథ 51
2. మూఁడు చేపల కథ 51
3. అపాయ సహితమైన యుపాయముచేఁ జెడిన కొంగ కథ 53
4. తన్ను వ్యాఘ్రముగాఁ జేసి కాపాడిన మునిని జంప యత్నించిన మూషికము కథ 56
5. కన్యగామారి తగినవరుఁడు దొరకక యథాస్థితి నొందవలసివచ్చిన మూషికము కథ 57
6. నీచు నధికారిగా వరించి చెడిన శశకపింజలముల కథ 60
7. పేరాస వలన నెండ్రకాయచే మృతినొందిన కొంగ కథ 64
8. తన యవివేకమువలన లబ్ధనాశమొందిన మొసలి గాథ 67
9. రెండు మారులు వంచింపఁబడి మరణించిన గాడిద కథ 76
10. ధూర్తులచే వంచింపఁబడి యజ్ఞమేషమును వదలుకొన్న బ్రాహ్మణుని కథ 81
11. దుష్టులమాటలు విని, నమ్మి, చెడిన తొట్టియ కథ 82
12. కార్యసిద్ధి నిమిత్తము కప్పలను మోచిన సర్పము కథ 87

సంపూర్ణ నీతిచంద్రిక

ద్వితీయ భాగము

విగ్రహము

అనంతరము రాజకుమారులు విష్ణుశర్మతో "ఆర్యా! మీదయవలన మిత్రభేదము సాంతముగా వింటిమి. విగ్రహము వినఁ గుతూహలముతో నున్నాము." అని పలుక, విష్ణుశర్మ యిటులు చెప్పఁదొడఁగెను.

"సమానబలముగల హంసలకు మయూరములకు విరోధము గలిగినపుడు వాయసము శత్రుమందిరమం దుండి నమ్మించి హంసలను వంచించినవి. మీకా కథ వివరించెదను వినుఁడు.

హిరణ్యగర్భుని వృత్తాంతము

కర్పూరద్వీపమున పద్మకేళి యను పేర నొప్పు నొక చెఱువు గలదు. అందు హిరణ్యగర్భుడను రాజహంస నివసించుచుండెను. అది జలచరములగు పక్షు లన్నిటిచే పక్షిరాజుగా నభిషేక మొందెను. ప్రజలు, చక్కఁగా నడపు నాయకుఁడు లేకున్నచో కర్ణధారుఁడులేని నావవలెఁ బ్రమాద మొందుదురు. ప్రజను రాజు రక్షించినచో ప్రజ రాజును గాపా

డును. పెంపుసేయుట కన్న ఉన్నదానిని రక్షించుట మంచిది. రక్షణము లేకున్న పోషణమున కవకాశమే యుండదుకదా!

ఒకనాడు రాజహంస చక్కగా పఱువఁబడిన కమల పర్యంకమున గూరుచుండి పరివారముతోఁ గొలువుదీరి యుం డెను. అపుడు దీర్ఘముఖమను నొకకొంగ యెచట నుండియో వచ్చి ప్రభువునకు నమస్కరించి కూర్చుండెను.

రా జపుడు "దీర్ఘముఖుఁడా! దేశాంతరమునుండి వచ్చి యుంటివి. విశేషము లేమైన నున్నఁ జెప్పుము." అనెను. అవు డా బకము "ప్రభూ! గొప్ప విశేషము గలదు. అది తమకు మనవి చేయుటకై తొందరపడి వచ్చితిని. జంబూ ద్వీపమున వింధ్యమను పేరుగల కొండ గలదు. అచట చిత్ర వర్ణుఁ డను మయూరము పక్షులకు రాజై యుండెను. నే నొక యడవిలోఁ దిరుగుచుండగాఁ జిత్రవర్ణుని యనుచరులు నన్ను జూచి 'నీవెవఁడవు? ఎచటనుండి వచ్చితివి?' అని యడుగ నే నిటుల చెప్పితిని.

"కర్పూర ద్వీపమునకు జక్రవర్తియైన హిరణ్యగర్భు డను రాజహంసుని యనుచరుఁడను. దేశాంతరములఁ జూడ వలయు నను వేడుకతో నిచటికి వచ్చితిని."

అపుడు వారు 'మీ దేశము, మా దేశముఁ జూచితివి గదా! ఈ రెండు దేశములలో నేది యుత్తమమైనది? ఏ దేశపు

రాజు యోగ్యుఁడు, సమర్థుఁడు నై యున్నాఁ’ డని ప్రశ్నింప; నే నిటు లంటిని :

“ ఏమి పలుకుచుంటిరి ? చాలభేదము గలదు. కర్పూర ద్వీప మనగాఁ గేవలము స్వర్గమే. మరియు రాజహంస యపర దేవేంద్రుఁడు. ఈమరుస్థలమున బడియున్నచో మీ కేమి ప్రయోజనము ? మా దేశమునకు రండు. ”

నాపలుకులకు వానికన్నింటికిఁ గడుంగడుఁ గ్రోధము కలిగినది. అది యుచితమే. ఎట్లన ; పామునకుఁ బాలువోసి పెంచిన వాని విషము వర్ధిలునటులు మూర్ఖుల కొనరించిన మంచిబోధ వారికిఁ గోపము కలిగించునే కాని శాంతి నొసఁ గదు. మఱియు నెఱుక కలవానికి బోధింపవలయుఁ గాని మూర్ఖున కెన్నఁడును బోధింపరాదు. వానరముల కుపదేశించి పక్షులు స్థానభ్రష్టములైన కథయొకటి కలదు. దాని నెఱిం గింతును వినుము.

వానరములకుఁ బోధచేసి చెడిన పక్షుల కథ

నర్మదాతీరమున నొక విశాల మైన బూరుగుచెట్టు గలదు. అచట గూళ్ళు కట్టుకొని పక్షులు కొన్ని సుఖముగా వాసము చేయుచుండెను. వర్షాకాలమున నొకనాఁ డచట నాకస మంతయు మబ్బు లావరించి ధారాపాతముగా వాన పడెను.

కొన్ని వానరములు వానకుఁ దడిసి, చలికి బాధపడుచు బూరుగుచెట్టుక్రిందకుఁ జేరినవి. వాని పట్ల జాలికలిగి పక్షులు 'ఓ వానరములారా! మేము మా యల్పశక్తిగల ముక్కులతో నెట్లో తృణములు సేకరించి గూండ్లుకట్టుకొని యుంటిమి. కర చరణాదులు కలిగియు మీ రిట్లేల దుఃఖపడవలయును?" అని పలికినవి. పక్షులపలుకులు వినుసరికి కోఁతుల కసూయ కలిగినది. 'చలిగాలి తగులని గూండ్లనడుమ సుఖముగా నుండి యీపక్షులు మనలను నిందించుచున్నవి. వాన వెలిసిన వెనుక వానిపని పట్టింతు' మని కూడఁబలికికొని వానరము లా బూరుగుచెట్టెక్కి పక్షిగూండ్లన్నిటిని భగ్నపఱచి గ్రుడ్లను చిదిపి క్రిందఁబడవైచినవి. కావున మూర్ఖులకు బోధింపరాదు."

అని దీర్ఘముఖుఁడు పలికిన మాటలు విని రాజహంస "పిమ్మట నా పక్షు లేమి చేసినదియుఁ జెప్పు" మని యడిగెను మరల బక యిట్లు చెప్పఁదొడఁగెను. 'ఆ పక్షులు గోపగించి 'రాజహంసను రాజును చేసిన వా రెవ' రని ప్రశ్నించినవి. 'మీ మయూరమునకు రాజ్యాభిషేకము చేసినవా రెవ' రని నేను కోపమునఁ బ్రశ్నించితిని. నాప్రశ్న కలిగి యవి నన్నుఁ జంప సిద్ధపడినవి. నేను నూరకుండక నా విక్రమముఁ గొంతఁ జవి చూపితిని.

స్త్రీలకుఁ సిగ్గు సొగసు కూర్చునటులు పురుషులకు నోరిమి యొకపుడు భూషణ మగును. కాని పరిభవము

రాఁబోవునపుడు విక్రమింపక తప్పదుగదా!" యన రాజహంస "తనబలము నెదిరిబలముఁ జక్కగాఁ బరిశీలించి తారతమ్యము గుర్తింపనివాఁడు శత్రువులచేఁ నవమానింపఁ బడును. అది గ్రహింపక వాగ్దోష మొనరింపరాదు. చిరకాలము పులిచర్మము గప్పుకొని సస్యముతో నిండిన పొలమున సుఖముగాఁ దిరుగుచు వాగ్దోషమువలన గదా పూర్వ మొక గాడిద చనిపోయినది? నీ కాకథ వినుతు" నని బకముతో నిట్లు చెప్ప మొదలిడెను.

వాగ్దోషము వలనఁ జెడిన గాడిద కథ

హస్తినాపురమున విలాసుఁడను నామముగల చాకలి యొక్కఁడుగలఁడు. వాని గాడిద బరువుమోసి మోసి, చిక్కి శవమువలె నయ్యెను. దానిఁజూచి యారజకుఁడు పులితోలు సంపాదించి దానిపై గప్పి యరణ్యసమీపమున నొక పంట పొలముమీఁద విడిచెను. అనంతరము దానిని జూచి పులి యని బ్రమసి పొలముకాపులు పాటిపోవఁజొచ్చిరి.

కొంతకాలమట్లు గడచిన వెనుక నొక పొలము కాపరి బూడిదరంగు గల కంబళము గప్పుకొని, విల్లమ్ములు సిద్ధపఱచుకొని, యొకచో దాగి యుండెను. స్వేచ్ఛతో సస్యములు దినుటచే బలిసిన యాగార్దభ మాతనిఁజూచి, వేఱొక గాడిద, యని భావించి, జాతిస్వభావముచే బిగ్గరగా నోండ్ర పెట్టుచు నెదురుగాఁ బరుగిడెను.

సస్యరక్షకుఁ డా ధ్వనింబట్టి ‘ యది గాడిదయేకాని పులి కాదని నిశ్చయించి యవలీలగా దానిని జంపివైచెను. కావున బరబల మెఱుఁగక వర్తింపరాదు ; వాగ్దోషమునకుఁ బూను కొనరాదు ” అని రాజహంస చెప్పినది విని దీర్ఘముఖుఁడు మరల నిట్లు చెప్పఁదొడఁగెను.

“ఆపక్షులు నాపలుకులు విని ‘యోదుష్టబకమా! మా భూమియందుఁ జరించుచు మాస్వామి నాక్షేపించు చుంటివి. ఇది యెంతమాత్రము క్షమింపరానిది.’ అని చెప్పుచు నవి యన్నియు ముక్కులతో ననుఁ బొడిచి కోపముతో నిట్లు పలికి నవి. ‘ ఓమూర్ఖుఁడా! మారాజయిన హంస సర్వవిధముల మృదు వైనవాఁడు. వానికి రాజ్యాధికారము నిందుసున్న. ఏలయన మిక్కిలి మెత్తనివాఁ డఱచేతి యందలి యర్థమునైన రక్షించు కొనఁజాలఁడు. అట్టివాఁడు నేల యెల్లలఁ గలుగును? వానికి రాజ్యాధికార మెట్లు పొసఁగును? మఱియు నీవు కూపస్థ మండూకమవు. కాఁబట్టియే యట్టివాని నాశ్రయింపుమని మా కుపదేశించుచుంటివి.

ఫలచ్ఛాయా సమన్వితమైన వృక్షము నాశ్రయించినచో దైవికముగా దాని ఫలము లనుభవింప జాలకున్నను దానినీడ ననుభవించుట కేయాటంకము నుండదు. కావున ఘనుల నాశ్రయింప వలయునే కాని హీనుల నెన్నఁ డాశ్రయింపరాదు. క్షీరమైనను గవండ్లదాని హస్తమునఁ బడినచో మద్యమని తలఁప బడును. గుణరహితమైన యాశ్రయమును బొంది

ఘనుఁడు గూడ నల్పుఁడుగాఁ గానఁబడును. మహాగజముచిన్న యద్దమున నల్పజంతువుగాఁ గానఁబడునుగదా! అతిసమర్థుఁడగు ఱేని పేరు చెప్పికొన్నను నొకపుడు ఫలసిద్ధి యగును. చందమామ పేరుచెప్పుకొని చెవులుపిల్లులు సౌఖ్యమొందిన కథ యొకటండు కలదు. నీకాకథ తెలుపుదుము వినుము.

చంద్రుని పేరుచెప్పుకొని మేలొందిన కుందేళ్ళ కథ

ఒకపుడు వానలు నేమి దాహాపీడితమైన యేనుఁగుల గుంపు తమస్వామినిజేరి 'ప్రభూ! మన కిఁక జీవనోపాయమేమి? క్షుద్రజంతువులైన మునుఁగుటకుఁ దగు గుంట కానరాదు. మనము స్నానమొనరించుటకు దగు వెరవులేక మృతప్రాయులమై యున్నాము. మనమేమి చేయుదము? ఎచటికిఁబోవుద' మని విలపింప గజరాజు కొంతదూరము తిరిగి నిర్మల జలముతో నిండినయొక చెఱువు గనుఁగొని వానిబాధ తొలగించెను.

ఏనుఁగులన్నియు నామడువునకు వచ్చుచుఁబోవుచుండ గట్టున నివసించుచున్న కుందేళ్లు వానిపాదములద్రొక్కుడుచే మడియుచుండెను.

వానిలో శిలీముఖుఁ డను నొక కుందేలు 'ఈయేనుఁగుల గుంపు దప్పికచే నిట్లు రోజు నీచెఱువునకు వచ్చుచుండును. అందువలన మన కుల మంతయు నశించునటు లున్నది.' అని పలుక విజయుఁ డను నొక ముదుసలికుందేలు 'విషాదము

నొందకుఁడు. నేను దీనికిఁ బ్రతిక్రియ చేయఁగలఁను' అని శపథముచేసి వెడలెను.

"ఏనుఁగు, స్పర్శమాత్రముననే చంపఁగలదు. పాము, కాటుచే మరణము గలిగించును. భూపాలుఁడు, పరిపాలించుచునే ప్రజను హతమార్చును. దుర్జనుఁడు, నవ్వుచునే హానికలిగించును. కావునఁ గొండశిఖరమెక్కి మఱియు గజనాయకునితో సంవాదమునకు దిగుదు" నని యాలోచించి విజయుఁడట్లు గిరిశిఖర మెక్కెను.

అంతలోఁ గజరాజువచ్చి యాతనిఁజూచి 'నీవెఁడ, వెచటనుండి వచ్చితి' వని ప్రశ్నింప 'నేను చెవులపిల్లిని. భగవానుఁడగు చందమామ నన్ను నీకడ కనుప వచ్చితిని' అని జవాబిచ్చెను. 'నీవు వచ్చినపనియే' మని హస్తి యడుగ విజయుఁ డిటులనియెను.

"శస్త్రము లెదుటఁ గానబడుచున్నను దూత యథార్థము పలుకవలయునేకాని మఱుగుపఱుపరాదు. కావున దూత యెల్లప్పుడు వధింప నసర్హుఁడు. నేను చంద్రుని యాజ్ఞచొప్పున నుడువుచుంటిని. వినుము. 'ఈ చంద్రసరోవరము గాపాడుచున్న శశకములను నీవు బాధించుచుంటివి. నీవు చేయు పని కడు ననుచితము. చిరకాలమునుండి యవి నారక్షణమున నున్నవి. కావుననే నాకు శశాంకుఁడని ప్రసిద్ధి. కావున జీవితమం దాశ గలదేని యిఁకెన్నఁడు నీ సరోవరము చెంతకు

రావల ' దని చంద్రభగవానుని సందేశము " అని పలుక నాగజపతి ' చంద్రభగవానుఁ డిపు డెచట నున్నాఁ'డని యడిగెను. దానికి విజయుఁడు మిత్రొకుఁడుచే నశింపఁగా మిగిలిన కుందేళ్ల నూరడించు నిమిత్త మీసరసునకు వేంచేసియుండి నన్ను నీకడ కంపె ' ననెను.

అది విని యాగజము ' కరుణింపు. తెలియక యీతప్పు చేసితిని. ఇంకెన్నఁడు నిట్టిపని జరుగదు ' అని పలికి, ' మీ స్వామి నొకపరి చూపుము ప్రణామ మొనరించి వేఱు చోటికిఁ బోవుదు ' నని గజము కోరెను. ' అట్లైన నీ వొంటరిగా ర ' మ్మని యర్ధరాత్రమున నేనుఁగును దీసికొనిపోయి నిర్మలజలము నడుమనున్న చంద్రబింబముఁ జూపి ' స్వామి సమాధియందున్నారు. కావున నెమ్మదిగా నమస్కరించి వెడలిపొమ్ము. కాదేని సమాధిభంగమున కాతఁడు మిక్కిలి కోపించును. ' అని శశకము చెప్పెను.

ఏనుఁగును మిక్కిలి భీతిల్లి యట్లే వందన మాచరించి వెడలిపోయెను. కుందే ళ్లాదినమునుండి నిర్భయముగా తమ తమ తావులందు వసించి సుఖముగాఁ గాలక్షేపము చేయుచున్నవి."

అని యాబక్షులు చెప్పిన పలుకులకు నేను "మాప్రభు వగు రాజహంస మహాప్రతాపవంతుఁడు. అతఁడు ముల్లోకములు నేలఁగల దిట్ట. ఒక రాజ్యమే యననేల ? " యంటిని.

దీర్ఘముఖుఁడు చిత్రవర్ణుని దర్శించుట

అపు డవి కోపించి వారి రాజగు చిత్రవర్ణునొద్దకు నన్నుఁ జేర్చి 'ప్రభూ! అవధరింపుము. ఈ దుష్టమగు కొంగ మన దేశమున సంచరించుచు దేవర నాక్షేపించుచున్నది' అని విన్నవించినవి. 'ఈతఁ డెవఁ' డని రాజడుగ 'హిరణ్యగర్భుఁ డను రాజహంసుని యనుచరుఁడు కర్పూరద్వీపమునుండి యీతఁడు వచ్చినాఁడు.' అని దెలిపినవి.

అపు డచటనున్న మంత్రియగు గృధ్రము నన్నిట్లు ప్రశ్నించెను. "మీరాజ్యమున ముఖ్యమంత్రి యెవరు?" "సకలశాస్త్రమర్మము లెఱిగిన సర్వజ్ఞుఁ డను చక్రవాము మాకు మంత్రి" యని నేనంటిని. "ఇది యుచితముగా నున్నది. మీమంత్రి స్వీయదేశస్థుడే; 'దేశస్థుని, కులాచారముల శుద్ధుడైనవానిని, వ్యసనములు లేనివానిని, మంత్రజ్ఞునిఁ, బండితునిఁ, గోశముఁ బెంపొందింపఁ గలవానిని మంత్రిగా నియమించుకొనవలయు' నని ఆర్యులు పలుకుదురు" అని యా గృధ్రము చెప్పుచుండునంతలో నచటి చిలుక కల్పించుకొని యిట్లనెను.

"ప్రభూ! కర్పూరద్వీపము మున్నగునవి జంబూద్వీపమున నంతర్గతమైన చిన్నదీవులు. వానిపై నధికారము దేవరవారిదే."

దాని కా రాజు "ఔనౌను. రాజు, మత్తుఁడు, శిశువు, ధనికుఁడు నలభ్యము లైన వానిం గూడ వాంఛించును. సులభముగా లభించువాని నేల యుపేక్షింపవలయును" అని పలుక నపుడు నేను "మాటాడిన మాత్రమున నాధిపత్యము లభించునట్లైన మాప్రభువునకు జంబూద్వీపముపై నధికారము గల" దంటిని. 'దీనిని నిర్ణయించు టె' ట్లని చిలుక ప్రశ్నించెను. 'దీని నిర్ణయించునది యుద్ధమే' యని నేను బదులు పలికితిని.

అపుడు రాజు 'మీస్వామి కడకేఁగి సిద్ధపఱుపు' మని నుడివెను. 'మీదూతను కూడ నావెంట పంపుఁ' డని నే నన; రాజు "మీలో దూతగా నెవ్వరు వెడలుదురు? భక్తుఁడు, గుణవంతుఁడు, పవిత్రుఁడు, సమర్థుఁడు, శత్రుమర్మములనెఱుఁగఁ గలవాఁడు దూత కృత్యమున కర్హుఁ" డని పలుక గృధము "ఇట్టివారు పెక్కుమంది కలరు; కాని వారిలో బ్రాహ్మణుడే పంపదగువాఁడు. ఆతనికి రాజధనమం దపేక్ష యుండదు." అను మాటలు పలుక రాజు "అట్లైనఁ జిలుకయే యీపనికి వెడలవలయును. ఓశుకమా! నీ వీతనితో నేఁగి నా యభిలాషను రాజహంస కెఱింగింపుము" అని యాజ్ఞాపించెను.

ఆయాజ్ఞవిని శుక మిట్లు లనియె. దేవరవారి యాజ్ఞకు విధేయుఁడను. కాని యీబకము కడుదుష్టమైనది. కావున దీనితో వెళ్ళజాలను. దుష్టు లొనరించు నేరమునకు ఫలితము

వారివెంటఁ జను సాధువు లనుభవింతురు. సీతను రావణుఁడపహరింపగా మహోదధికి బంధనము ప్రాప్తించెనుగదా! కావున దుష్టునితో వసించుట, పయనము సేయుట యుక్తము కాదు. కాక స్నేహమువలన నొక హంసయు, నొక వర్తక పక్షియు హాని చెందెను. నీ కా కథ యెఱింగింతును వినుము.

కాక స్నేహమున మరణించిన హంస కథ

ఉజ్జయినీ మార్గమున నొక జువ్విచెట్టు గలదు. అచట హంస కాకములు వసించుచుండెను. గ్రీష్మకాలమున నొక నాఁడు బాటసారి యొకఁడు మార్గశ్రాంతుఁడై యాచెట్టు నీడను విల్లమ్ముల నిడుకొని నిదురించెను. క్షణకాలమున నాతని ముఖమునుండి నీడ తొలఁగిపోయెను. ఆతని ముఖమున గాటమగు నెండ సోకుచుండెను. అది చూచుచున్న చెట్టు మీఁది యంచకు జాలికలిగెను. అది తన ఱెక్క లాతని ముఖముపై నీడ పడునట్లు విప్పియుంచెను. కొంత సేపైన పిదప సుఖనిద్ర నొందిన యాతఁడు నోరు తెఱచి యావులించెను. అపుడు పరసుఖమును సహింపనిదియు, సహజముగా దుష్టమైనదియు నగు కాకి యాతని నోట రెట్టవెచి పాఱిపోయెను. బాటసారి తలపైకెత్తి చూచుసరికి హంస కానఁబడియె. ఈపని చేసిన దిదియే యని తలఁచి యాతఁడు తన వింటిచేఁ గొట్టి దానిం జంపి వైచెను.

కాక స్నేహమువలనఁ జనిపోయిన వర్తక పక్షి కథ

ఒకపుడు గరుడయాత్ర నిమిత్తమై పక్షులు బయలుదేరి సముద్రతీరమున కేఁగినవి. అపు డొక కాకివెంట నొక వెలిచె పిట్టకూడ జనుచుండెను. గోపాలుఁ డొకఁడు పెరుగు కడవ తలపై నిడుకొని పోవుచుండెను. కాకి యా కుండ యందలి పెరుగు మాటిమాటికి దొంగిలించి తినుచుండెను. పెరుగుకుండ క్రిందనుంచి గొల్లఁడు పైకి చూచుసరికి కాకవర్తకములు గానఁ బడియె. అద నెఱిఁగి కాకి పాఱిపోయెను. ఆ వర్తకపక్షి నిజ ముగా నిరపరాధి కావున మెల్లగా నెగురుచుండ గొల్లఁడు దానింబట్టి చంపివైచెను. కావున నే నిట్లు చెప్పవలసివచ్చెను.''

ఆ శుక మిట్లుపలుకఁగా, నే నిట్లంటిని. "సోదరశుకమా! యిట్లు పలుకుట దగదు. నాకు ప్రభు వెంతయో నీవు నంతియ.'' నామాటల కది 'యగుఁ గాక దుష్టుల పలుకులు ప్రియముగాఁ గానఁబడినను నకాల కుసుమముల వలె భయ సంజనకము లగును. నీ మాటలవలననే నీ దుర్జనత్వము వెల్లడి యగుచున్నది. మన, భూపాలు రిద్దరకు యుద్ధకారణము నీ మాటయే కదా!' యని బదులాడెను.

అపుడు రాజును నన్నుఁ దగురీతి సత్కరించి పంపెను. చిలుకయు వెనుక నుండి వచ్చుచుండెను. ఈ వృత్తాంత మంతయుఁ జిత్తగించి కర్తవ్య మాలోచింపు'' డని దీర్ఘ ముఖుఁడు రాజహంసతో బలికెను.

అపుడు మంత్రి యగు చక్రవాక మిటు లనియెను. "దేవా! ఈకొంగ విదేశములకుఁగూడ నేఁగి తనకుఁ దోఁచిన రీతి రాజకీయములు నడిపెను. మూర్ఖుల విధ మిట్టిదియే నూ ఒాసఁగియైన వివాద ముడిపికొనుట విజ్ఞుని లక్షణము. కారణము లేకున్నను వివాదమునకు దిగుట మూర్ఖుని చిన్నె."

ఆ పలుకులు విని రాజహంస "నిందించుటవలన నేమి లాభము ప్రస్తుత కర్తవ్య మాలోచింతము" అనియెను. అపుడు మంత్రి "స్వామీ ఏకాంతమున మాటాడుదము. వర్ణాకారనేత్రముఖసంజ్ఞాదులచే మనసు నూహింపఁ గలరు. కావున మంత్రాలోచనము రహస్యమునఁ జేయఁదగును." అను పలుకులు విని యితరు లందఱు వెడలిపోయిరి.

అపుడు చక్రవాకము "ప్రభూ! నా కిటులు దోఁచు చున్నది. మన యుద్యోగులలో నెవరో యొకరి ట్టీ బకమును పురికొలిపి యుందురు. వైద్యులకు రోగార్తుఁ డవసరము. ఉద్యోగులకు వ్యసనపరుఁడగు ప్రభువు ప్రియుఁడు. పండితులకు మూర్ఖుఁడన్న వింత. సత్పురుషులకు మాత్రము మంచి విషయములం దిష్టము" అని పలికెను.

దానికి రాజు "అగుఁగాక! కారణము పిమ్మట నిశ్చ యింతము. ముందు కర్తవ్యము నిరూపింపవలయును." అనెను. అపుడు చక్రవాకము "దేవా! గూఢచరు నొకనిఁ బంప వలయును. పిమ్మట వారిజాడ, బలాబలము తెలియంగఁ దగును.

పరరాష్ట్రము లందలి కార్యాకార్యము లెఱుఁగఁ జాలిన గూఢచారులులేని రాజు నిక్కముగా నంధుఁడు.

ఆ దూత యొక విశ్వాసపాత్రుఁడగు ననుచరునిఁ దీసికొని వెడలుట మేలు. ఒకఁ డచటనుండి అచటి మంత్రకార్యము చక్కఁగా రహస్యముగా నెఱింగి రెండవవానికిఁ దెలిపి పంపగలఁడు. గూఢచారుఁడు జలస్థలముల రెండింటఁ జరించువాఁడగుట మంచిది. కావున నీబకమునే పంపుము. ఇట్టి మఱొక బకమునే సహాయునిగా బంపుము. ఈసంగతి యతిరహస్యముగాఁ గావింపుము ముప్వురిచెవుల బడిన మంత్రాలోచనము వెల్లడియైపోవును. కావున రాజెపుడు మూఁడవవాఁ డుండగా మంత్రాలోచన చేయరాదు. 'మంత్రము భగ్నమైనందున కలుగు ననర్థములు చక్కబఱుప నశక్యము' లని నీతివిదులు పలుకుదురు." అను మంత్రిమాటలకు రా జాలోచించి "నాకుఁ దగిన గూఢచరుఁడు లభించినాఁ" డని పలికెను. దానికి మంత్రి "యత్నైన సంగ్రామమున విజయము లభించినట్లే" యనెను.

చిలుక రాయబారము

ఇంతలో ద్వారపాలకుఁడువచ్చి నమస్కరించి "జంబూద్వీపమునుండి వచ్చిన యొకశుకము తమ దర్శనార్థము ద్వారమున నుండె నని విన్నవింప రాజహంస చక్రవాకమువైపు చూచెను. అపు డా చక్రవాకము "ఆతని నతిథి బసయం

దుంచుము. పిమ్మటఁ జూడవచ్చు నన ద్వారపాలకుఁ డాతనిఁ దీసికొని వెడలిపోయెను.

రాజు జక్కవతో "మనకిఁక యుద్ధము సంప్రాప్తమయి నట్లే" యనఁ జక్రవాకము "ముందుగనే యుద్ధము చేయ రాదు. ముందుగనే యుద్ధమునకును, స్వభూమిఁ ద్యజించుట కును ననాలోచితముగాఁ బ్రభువును బ్రోత్సహించు నాతఁడు దుష్టమంత్రి యనఁబడును. శత్రువులను రణముచే జయింపవలె నని యెన్నఁడు దలఁపరాదు. యుద్ధములో జయ మెవ్వరి కగునో యేరి కెఱుక? సామదానభేదములలో నే యొకదానిచేఁ గాని; లేదా యన్నింటిచేఁగాని వైరులను సాధించుటకు యత్నింపవలయును. యుద్ధమునఁ జొరబడి యరుల సామ ర్థ్యముఁ జవిచూడనంతవఱ కందఱును శూరులే.

ఇఁక యుద్ధము సమీపించినదను సంగతి గమనింపఁ దగినది. సకాలప్రయత్నమువలనఁ కృషిఫలించునటులు నీతి చక్కఁగా రక్షింపబడినచోఁ జిరకాలము ఫలింపగలఁదు. యుద్ధము దూరమున నున్నపుడు భయమును, సమీపించిన కొలఁదియు శూరత్వమును మహాత్ములలక్షణములు. ఆపద కలిగినపుడే మహాత్ముఁడు ధైర్యము నొందఁగలఁడు. తొందర పాటు సకలసిద్ధులకుఁ గడు నంతరాయము. అతిశీతలమైన జలము పర్వతముల గదల్చివేయలేదా?

మఱియు మయూరరాజగు చిత్రవర్ణుఁడు మహాబలుఁడు. బలవంతునితో సంగర మొనర్పవలె ననుట కెచటను దృష్టాంతము

గానరాదు. ఆయుద్ధము తగరుకొండను డీకొనుటయే కూర్మము వలె కాలము కానపుడు సంకోచ మొంది యవమానమైన సహింపఁదగును.

సమయము సంప్రాప్తించినపుడు నీతిజ్ఞుడు క్రూరసర్పము వోలె విజృంభింపవలయును. నదీవేగము తృణములను సమాన ముగా పెకలింపఁ గలుగున ట్లుపాయశాలి యెట్టివానినైన నున్మూలింప శక్తుఁ డగును.

కావున నాదూతను రావించి దుర్గము సన్నద్ధ మొనర్పఁ బడువలటకుఁ గాలయాపన చేయఁదగును ఏలయన; గోటయం దున్న యొక్క యోధుఁడు బయటి నూఱుగురితోఁ బోరఁగలడు. నూఱుగు రైనచో లక్షమందితో యుద్ధ మొనరింపవచ్చును.

కావున దుర్గమం దిట్టి విశేషము గలదు. దుర్గమున లేని రాజు తెప్పనుండిజాఱిన మనుజునివంటివాఁడు; అట్టివాఁడు శత్రుపరాభవమునకు సులభుఁడు.

దుర్గముచుట్టుఁ బెద్ద యఖాతముఁ ద్రవ్వింపవలయును. ఉన్నతమైన ప్రాకార ముండదగును. కొండలనుగాని, నదుల లనుగాని, వనములనుగాని, యాశ్రయించి యుండవలయును. విస్తీర్ణత, అతివిషమత్వము జలసమృద్ధి, ధాన్యసమృద్ధి, కట్టెల సమృద్ధి, ప్రవేశము, నపఃసారము ననునవి దుర్గమునకు సప్తసంపద లనఁబడును.” అని చక్రవాకము వలుక; రాజహంస ‘ అయిన

దుర్గ సన్నాహమున నెవరు నియమింపఁదగుదు' రనఁ జక్ర వాకము మరల నిటు లనియె.

"ఎవ డేపనియందు సమర్థుడో వాఁడాపనియందు నియోగింపఁదగినవాఁడు శాస్త్రపండితుఁడు కూడ వ్యవహారానుభవము లేమి ప్రమాద మొందుటగలదు. కావున సారస పక్షిని రప్పించుట యుచితము"

ఆప్రకారము పిలువఁబడి వచ్చిన బెగ్గురుపక్షితో రాజిటు లనియెను. 'ఓయీ, సారసా! నీవు శీఘ్రముగా నొక దుర్గము నిర్మింపు' మన నా సారసము "ప్రభూ! ఇప్పటికిపుడే దుర్గము సునిర్మితమై యున్నదనియే భావింపుము. ఈ మహా సరోవరమధ్యమందలి ద్వీపమున ద్రవ్యములన్నియుఁ జేర్చుటయే తరువాయి. అన్నిటికంటె నాహార ధాన్యాదిక సంగ్రహమే కడుంగడు ముఖ్యము. ముఖమున మణు లునిచినను నాహారము లేనిదే ప్రాణధారణ మసంభవము కదా! సర్వ రసములకు నుత్తమము లవణము. అది లేని యే వ్యంజనమైనను గోమయ తుల్య మగును." అని విన్నవింప; రా 'జటులైనఁ ద్వరిత ముగఁబోయి సకలము సమకూర్పుము' అని యాజ్ఞాపించు నంతలోఁ బ్రతీహారి ప్రవేశించి 'దేవా సింహళద్వీపము నుండి మేఘవర్ణమను వాయసము సపరివారముగా నరు దెంచి 'భవదీయదర్శనాపేక్షతో ద్వారమం దుండె' నని విన్నవించెను.

హిరణ్యగర్భుడు మేఘవర్ణునిఁ గొలువునఁ జేర్చుకొనుట

'కాకములకు బహువిషయములు తెలియును గానఁజేర్పఁ దగు'నని రాజు పలుకఁ, జక్రవాకము 'నిజమే కాని కాకము స్థలచరము, మఱియు శత్రుపక్షమున నుద్యోగి; కాన నెటులు చేర్పఁ దగును? ఆత్మపక్షము విడిచి పరపక్షముం జేరు మూఢుఁడు నీలివర్ణపు నక్కవలెఁ బరులచే హాని నొందును. నీ కా జంబుకము గాథ తెలుపుదును వినుము.

ఆత్మపక్షము విడిచి పరపక్షముఁ జేరి మరణించిన నక్క కథ

ఒక యరణ్యమున నొక జంబుకము గలదు. అది యొక నాఁడు నగర పరిసరములందు స్వైరముగాఁ దిరుగుచుఁ బ్రమాదమున నొక నీలిమందుకుండయందుఁ బడెను. పడి దానినుండి లేవఁజాలక ప్రాతఃకాలమునఁ, జనిపోయినదానివలె నటించెను. అపుడు యజమానుఁడు వచ్చి, యది చచ్చినదని తలఁచి దూరముగాఁ బాఱవైవ నది యచటినుండి పాఱిపోయెను.

అనంతర మది యడవిలోనికిఁ బోయి తన నీలవర్ణముఁ జూచుకొని యిటులు తలపోసెను. 'నా రం గిపుడు ప్రశస్తమైనది కావున నేను నా గొప్పతనముఁ జాటుకొనవలదా?' అని యాలోచించి, తన జాతి నక్కలను బిలిచి యిటు లనియె. 'నా కీ వనదేవత స్వహస్తములతో వన రాజ్యమున సకలౌషధి రసములచే నభిషేక మొనరించెను. కావున నేఁటినుండి యీ

యరణ్యమున నాయాజ్ఞచే వ్యవహారములు నడుపుకొన వల యును' అని పలుక, నక్కలన్నియు దాని వర్ణవిశేషముఁ జూచి, సాష్టాంగ నమస్కారములు చేసి దాని యాజ్ఞ లంగీక రించెను. ఈ రీతిగా సకలారణ్య వాసులయందు నధికారము దానికి లభించెను. అనంతర మా జంబుకముజాతి వార లందఱి సహాయ ప్రోత్సాహములచే ఘనత నొందెను. పిమ్మట నా జంబుకంబునకు వ్యాఘ్రములు, సింహములు మున్నగు మహా సత్త్వములు గూడఁ బరిజనులై కొలువ జొచ్చెను.

ఇట్లు జరుగుచుండఁగా నొకనాఁ డానక్క సభలోఁ దన జాతి జంబుకములఁ జూచి సిగ్గిలి వాని నవమానించి దూర ముగాఁ దఱుమఁ గొట్టెను. అందుచే నక్కల కన్నిటికి మిక్కిలి విషాదము గలిగెను. ఒక వృద్ధజంబుకము కడమ వానిం జూచి "చింతింపకుఁడు. మన కవమానము గలిగించిన యీజంబుకము నశించు నుపాయ మొండుగలదు. మనము దాని రహస్య మెఱుంగుదుము. నీతివేత్తలము కావున నాయుపాయ మవలంబింతము. ఈ వ్యాఘ్రాదిజంతువులు వర్ణ మాత్రమున మోసపోయి నక్క యని యెఱుగక దీనిని రాజుగా గుర్తించినవి. కావున మన మందరము సంధ్యాకాల మున సమీపమునకేఁగి ఒక్కసారిగా గొప్పధ్వని చేయుదము. మన కూఁతలు విని జాతిస్వభావముచేత రాచనక్కయుఁ గూయును. కూఁతవలన నదియు జంబుకమేయని వ్యాఘ్రాది జంతువు లెఱుంగలవు." అని పలికెను.

అనంతర మవి యన్నియు ననుకొన్నట్లు చేరి కూఁతలకు మొదలిడగానే నీలివర్ణ జంబుకమును కూయఁ జొచ్చెను. ఎవ్వరి కైనను స్వభావము దాఁటరానిది. కుక్కను పసిడిగద్దె యెక్కించినను నది చెప్పు గొఱుకకుండునే?

పిదప నానవ్వాడి విని వ్యాఘ్రము నీలివర్ణపు సృగాలమును జంపివైచెను. కావున నాత్మపక్షము విడిచి పరపక్షమును జేరదీయరాదు." అను మంత్రిమాటలు విని రాజహంస యిట్లు నియెను.

"ఈ సంగతి నిజమే యయినను; ఈ శుకము దూరము నుండి వచ్చియున్నది. కావున దీనిఁ జూచుట యుచితము. దానిం జేర్చు విషయము పిమ్మట నాలోచింపవచ్చును."

చక్రవాక మా మాటలు విని 'దూతను పంపుటయైనది. దుర్గము సర్వసంసిద్ధము కావున శుకమును బిలిచి మాటాడి పంపవచ్చు' ననెను. అనంతరము శుకకాకములు కొలువు కూటమునకుఁ గొనిరాఁబడెను.

ఉచితాసనమునఁ గూరుచుండి కొంచెము తలయెత్తి చిలుక "ఓ హిరణ్యగర్భుఁడా! మహారాజాధిరాజు శ్రీమచ్చిత్రవర్ణులవారు 'నీకు జీవితముననుు, సంపదల యందును గోరిక గలదేని, త్వరితముగవచ్చి నాచరణములకు నమస్కరింపుము. లేదేని వెంటనే మఱియొక చోటికి లేచిపొమ్ము.' అని యాజ్ఞాపించుచుండి" రని పలికెను. ఆ పలుకులకు హిరణ్యగర్భునకుఁ

గోపమువచ్చి 'ఈ దుష్ట శుకమును మెడఁబట్టి గెంటివేయువా రెవరు నిచటలేరా!' యనెను. అపుడు కాకియైన మేఘ వర్ణుఁడులేచి 'ప్రభూ! ఆజ్ఞయైనచో నీ చిలుకను దునిమివైచెద' ననెను. సర్వజ్ఞుఁ డపుడు రాజును, గాకమును వారించి ప్రభువుతో నిటు లనియెను.

"పెద్దలులేనిసభ సభ యనిపించుకొనదు. ధర్మమును బలుకువారే పెద్ద లనఁబడుదురు. ధర్మము సత్యమును వీడి యుండదు. 'మిషతోఁగూడిన యది సత్యము కానేర' దని పెద్దలు వచింతురు. ఇచట ధర్మ మేమన; రాజు దూతముఖము ననే సందేశ ప్రతిసందేశములు నడుపును. కావున దూత యెట్టి వాఁడైనను వధ్యుఁడుగాఁడు. కత్తులుచూపి బెదరించుచున్నను దూత యథార్థము వచింపక తప్పదు. దూతవాక్యముల వలన దన హీనత్వమునుగాని, పరులయున్నతిని గాని భావింప రాదు." చక్రవాకమాడిన యీ హితమును విన్నపిదప హంస కాకములు శాంతి నొందినవి. చిలుక లేచి కదలెను. చక్ర వాకము చిలుకను బిలిచి యాదరించి బంగారునగలు మున్నగు కానుక లిచ్చి పంపెను.

ఇట్లు రాయబారము నడపి చిలుక వింధ్యపర్వతము మీఁదికిఁ బోయి తన రాజునకు వందన మాచరించెను. "విశేష మేమి?" యని రాజు ప్రశ్నింప "సంగ్రహముగఁ జెప్పు చున్నాను వినుము. వెంటనే యుద్ధ ప్రయత్నము చేయ వలయును. ఆ కర్పూరదేశము స్వర్గములోని యొక భాగమని

తోఁచినది. దాని రా జపరశచీపతియే. ఇంతకు మించి వర్ణించుట కష్టము" అని విన్నవించెను.

అనంతరము రాజు, పెద్ద లందఱను రావించి వారితో మంత్రాలోచనమునకుఁ గూరుచుండి యిటులనెను. "ఇవుడు సంభవించిన యుద్ధము విషయమునఁ గర్తవ్యమే మో యాలోచించి తెలుపుఁడు. యుద్ధముమాత్రము తప్పదు. ఏల యన, బ్రాహ్మణులు సంతుష్టిలేకున్న లజ్జాహీనయగు కులస్త్రీ వలె జెడిపోవుదురు. మహీపాలురు సంతుష్టినొంది యున్నచో లజ్జావతులగు గణికలవలెఁ జెడిపోవుదురు."

ఆపలుకులు విని దూరదర్శియను గ్రద్ద యిటు లనెను. "రాజా! వ్యసనముఁ జెంది యుద్ధమునే ముఖ్యముగాఁ గోరుకొనరాదు. యుద్ధమునకుఁ బ్రయోజనములు మూఁడు. భూమి, మిత్రుఁడు, ధనము ననునవి. ఈమూఁడిటిలో నేయొకటియైనఁ దప్పక లభించునను నిశ్చయ మున్నయెడల యుద్ధ మొనరించుటలోఁ దప్పులేదు."

గ్రద్ద మాటలువిని రాజు. "ముందు మంత్రి నాబలము గుర్తింపవలయును. అపుడు దీనియుపయోగము నెఱుఁగగలఁడు. అనంతరము దైవజ్ఞునిఁ బిలిచి ముహూర్త నిర్ణయ మొనరింపఁ దగును." అని పలికెను. దానికి మంత్రి "ఒకవేళ యుద్ధమే నిశ్చయింపఁబడినను వెంటనే దండెత్తుట యుచితము గాదు. శత్రుబలముఁబరిశీలింపక యుద్ధమునకుఁ జొరవసేయు

వారు ఖడ్గధారల యాలింగనములు దప్పక పొందఁగలరు" అనెను.

అపుడు రాజు 'మంత్రీ! యేమైనఁ నిఁక నా కుత్సాహ భంగముఁ గల్పింపక శత్రువిజయమున కుపాయ మెఱింగిం పుము.' నావుడు 'సరే! చెప్పుచున్నాను. అది యనుష్ఠింప బడినపుడు తప్పక ఫలితము చేకుఱును. ఆచరణము లేని మంత్రాలోచనము నిరుపయోగము. ఔషధము పేరుచెప్పిన మాత్రాన రోగము కుదురదుగదా! ప్రభువులయాజ్ఞ దాఁట రానిది. నద్యద్రివనదుర్గములలో నెచ ఁటచట భయమునకవకాశ మున్నదో యచటనచట సేనానులు వ్యూహములు పన్నుకొని యుండవలయును. సర్వసేనాని ముఖ్యులగు వీరులతో ముందుగా నేఁగవలయును. మధ్యమునఁ బ్రభువు, భార్య, కోశము, బల హీనమగు సేనయు నుండవలయును. ఉభయపార్శ్వములందు గుఱ్ఱములు, వాని కిరువైపుల రథములు, వానిప్రక్క నేనుఁగులు, వానిప్రక్క పదాతులు, వెనుక సేనాపతులు నుండి ఖిన్నుల నోదార్చుచుండవలయును.

రాజునకుఁ గోశము ముఖ్యము. కోశములేని రాజునకు రాజ్య మొక్కనాఁటికి నిలువదు. మానవుఁ డింకొక యెట్టి మానవునకు దాసుఁడు గాజాలఁడు. ధనమునకే దాసుఁ డని నమ్మెము. గౌరవాగౌరవములకుఁ గలిమిలేములే కారణము. సకల సేనలకు గజములు ముఖ్యములు. గజము తన యవయవ ములుచేతనే యష్టాయుధ మనఁబడును. అశ్వములు సేనకు

ప్రాకారము వంటివి. కావున నధికమగు గుఱ్ఱపు దళముగల వానికి విజయము తప్పదు. అశ్వము లధిరోహించి యుద్ధము చేయువారిని దేవతలైన జయింపలేరు. దూరమందలి శత్రువులును వారికిఁ జేతిలోనివారే. సైనికులకు బహుమానము లొసంగవలయును. అట్లుచేసిన, వారు ద్విగుణమగు నుత్సాహముతో యుద్ధముచేయుదురు.

శత్రువులలో భేదము పుట్టించుటకు జ్ఞాతిని మించిన యుపాయము లేదు. కావున నెట్టిశత్రువునకు దాయాదు నొకని లేవదీయవలయును. యువరాజునుగాని, ముఖ్యమంత్రిని గాని లోబఱచుకొనవలయును. దానివలన వారిలో నంతర్ద్వేషము రగులుకొనును.

అహితులు తమలోఁ దాము విరోధించుకొనుటవలన మిక్కిలి మేలుకలుగును. ఈయర్థము వివరించు కథ యొక్కటి గలదు. నీకు దానిం జెప్పెదను. వినుము.

చోరబ్రహ్మరాక్షసులు కలహించుకొని యింటియజమానునకు మేలు చేసిన కథ

ఒకానొక యగ్రహారంబునఁ గర్మవిదుఁడైన యొక బ్రాహ్మణోత్తముఁ డుండెను. ఆతఁడు హోమ క్రియాదుల నిమిత్తము రెండు ప్రశస్తమైన గోవులను గొని వానిం జక్కగా

మేపుచుండెను. ఆగోవుల నెట్లైన నపహరింపవలయునని యొక దొంగ తగిన సమయమునకై నిరీక్షించుచుండెను.

ఒకనాఁ డాకసమున మబ్బులు క్రమ్మి సన్నని చినుకు రాలుచుండెను. అపు డర్ధరాత్రము గూడ నై యుండుటవలనఁ జీఁకటి మఱింత దట్టముగా నుండెను. మనుష్య సంచార మెచటను లేదు. గోవులను దొంగిలించికొని పోవుట కిదే మంచి యదనని యూహించి దొంగ బ్రాహ్మణు నింటికి మెల మెల్లన నరుగుచుండెను.

ఆచీఁకటిలో నట్లు కొంతదూరము పోయిన యనంతర మెదురుగా వచ్చుచున్న యెవ్వఁడో యొకవ్యక్తి యా దొంగకుఁ దగులుకొనెను. చోరుఁడు కొంచెము బెదరి "ఎవ్వఁడవు నీ" వని ప్రశ్నించెను.

"నేను బ్రహ్మరాక్షసుఁడను. నన్నుఁ దాఁకఁ గలిగి నంతటి ఘనుఁడవైన నీవెవ్వఁడ?" వని యాతఁడు తిరిగి ప్రశ్నించెను.

"నేను దొంగను లెమ్ము" అని యా చోరుఁడు పలుకఁగా "నింత ప్రొద్దుపోయి యెచటి కేఁగుచుంటి" వని యా బ్రహ్మరాక్షసుఁ డడిగెను.

"ఈ గ్రామమున నొక బ్రాహ్మణోత్తముఁడు గలఁడు. ఆతనికడ ప్రశస్తములైన రెండు ధేనువులు గలవు. వాని నపహరించుటకై పోవుచుంటి" నని దొంగ బదులుచెప్పెను.

“ నేనుగూడ నాబ్రాహ్మణునిఁ బట్టుటకై పోవుచుంటిని మన మిర్వురముఁ గలిసియే పోవుదము రమ్ము” అని యా బ్రహ్మరక్కసుఁడు పలికెను.

ఈవిధమున వా రిరువురు నడచి నడచి యాభూసురుని యింటి దరి కేఁగిరి. గృహద్వారముకడ నిలిచి బ్రహ్మరాక్షసుఁడు చోరునితో “ నేను ముందుగాఁ బోయి యా బ్రాహ్మణునిఁబట్టి లేపుదును. ఆతఁడు నాకింత భుక్తి యిడి పంపును. అనంతరము నీవు గోవులను దోలుకొని పొమ్ము ” అని పలికెను. దాని కంగీరింపక యాచోరుఁ డిట్లనెను.

“ నీవు ముందుగానే యాబాపని మేలుకొలిపిన నిఁక నేను గోవులఁ దోలుకొనిపోవుట యెట్లు ? ఆయింటి వారుఁ బొరుగువారు మేలుకొన్న గోవులను విడిచి నేను పలాయన మొనరింప వలసివచ్చును. కావున నేను ముందుగా ధేనువులఁ దోలుకొని శీఘ్రముగా నూరు విడిచి పోవుదును. అనంతర మా బ్రాహ్మణునిఁ బట్టుకొని నీ కోరిక యీడేర్చుకొనుము ”

ఈవిధముగా మాటమీఁద మాటవచ్చి వా రిరువురకుఁ గలహాము ముదిరెను. వారిరొద కింటిలో నిదురించు చున్న బ్రాహ్మణునకు మెలఁకువ గలిగెను. ఆతఁడు వెంటనే లేచి ద్వారముకడకు వచ్చి తలుపుతీయకుండఁగనే “యర్ధరాత్ర సమయమున వచ్చి మావాకిటఁ గలహ మాడుచున్నా వారెవ్వ” రని ప్రశ్నించెను.

“ ఈతఁడు బ్రహ్మరాక్షసుఁడు. నిన్నుఁబట్టి బాధించు టకై యదను జూచుకొని వచ్చినాఁడు ” అని చోరుఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

“ ఈతఁడు దొంగ నీగోద్వయమును దొంగిలించి తోలు కొని పోవుట కీయర్ధరాత్రమున వచ్చి యున్నాఁడు ” అని బ్రహ్మరాక్షసుఁడు బదులు పలికెను.

బ్రాహ్మణుఁడు వారి సమాధానముల వలన సంగతి యంతయు గ్రహించెను. వెంటనే యెలుఁగెత్తి పిశాచోచ్చా టనమంత్రములు పఠించెను. వాని ప్రభావమున నచట నిలువ లేక యా బ్రహ్మరాక్షసుఁడు పాఱిపోయెను. ఎవ్వరైన మేలు కొన్నఁ దన్నుఁ బట్టుకొందురని యాచోరుఁడు సందులం బడి పలాయన మొనరించెను.

ఇట్లు మంత్రి చెప్పినకథ యాలించి రాజిటు లనియెను. “వేయిమాటలేల! ఆత్మోదయము, పరుల క్షీణత యను రెండు తెఱంగులు కలదియే నీతి. ఆరెండింటి నెఱుగజాలువాఁ డింద్ర పదవి నొందఁ గలుగు” నని వచించెను. పిదప దైవజ్ఞుఁ డిడిన మూహూర్తమున దండయాత్రకు బయలుదేఱెను.

అచట హిరణ్యగర్భు డంపిన దూత తిరిగి వచ్చి ప్రభూ రాజగు చిత్రవర్ణుఁడు దండెత్తి వచ్చి మలయపర్వతపుఁ జరియ లలో విడిసియున్నాఁడు. ప్రతిక్షణ మేమఱుపాటులేక దుర్గ శోధనముఁ జేయవలయును. ఏలయన మహామంత్రి యగు

గృధ్రము విశ్వాసపాత్రుఁడగు నొకనితో ముచ్చటించుచుండ వింటిని. మన దుర్గమున నీవలె కే శత్రువులచే నియుక్తుఁడగువాఁ డొకఁడున్నట్లు నాకవగతమైనది.' నావుడు నామాట యందుకొని చక్రవాకము 'ప్రభూ! అట్లు నియోగింపఁబడినది కాకమే కాని వేఱొండు కా' దనెను.

అపుడు రాజు "అల్పుఁడును గాదు. అదియే కదా చిలుకను జంపుటకు సిద్ధపడినది! మఱియుఁ జిలుక యిచటికి వచ్చిన నాఁటినుండి యది యుద్ధమునకు కాలుదువ్వుచుండెను. నావుడు మంత్రి "అయినను నూతనాగంతుకుఁడు నమ్మఁదగఁడు" ఈయర్థము నెఱిఁగించు కథ యొకటిగలదు? నీకది యెఱింగించెదను వినుము.

నూతనాగంతుకుని నమ్మిచెడిన మందవిసర్పిణి కథ

మందవిసర్పిణి యను పేరుగల యొక చీరపేను రాజశయ్యం జేరి యెచటికిఁ బోక చిరకాలము నివసించి యుండెను. రాజు గాఢ నిద్రావశుఁడై యున్న సమయమున నాతని రక్తము గ్రోలుచుండెను.

ఒకనాఁడు డిండికమను పేరుగల నల్లి యారాజ శయ్యఁ జేరి చీరపేనితో నిట్లనెను.

" నీపాదములకు మ్రొక్కెదను. నేఁటినుండి నీవాఁడను. నీచుట్టముగా భావించి నన్నుఁగాపాడుము "

ఆమాటలు విని మందవిసర్పిణి "యీవిధముగా స్తోత్రము చేయనేల? నాపుణ్యమువలన నీచటికి వచ్చితివి. నా వంశము పావనమయినది. నే నీరాజశ్రేష్ఠుని పానుపున సుఖినై యుంటిని. నన్నేమి కోరఁదలఁచి యిచటికి వచ్చితివి? నాకిచట నేమి యైశ్వర్యము గలదని యెంచితివి?" యని పలుకఁగా నా డిండిక మిటు లనియెను.

"యాచకుఁడు తన యవసరము కొలఁది యాచించును గాని యెదుటివాని కలిమిలేములు పాటింపజాలఁడు. ధనాపేక్షచే మిక్కిలి యఱచునుగాని 'యీతఁడు లోభి, యీతఁడు దాత' యని యెఱుంగలేఁడు. విత్తముం గోరి సభలలో నుపన్యసింపఁ బోవునుగాని, తన విద్య చాలదని గుర్తింపఁ జాలఁడు. డాబుగానున్న వాని నెల్లఁ జేరి నేర్పుకొలఁది మాటలాడి విత్తమడుగును. ఏదాతయైన నిచ్చిన సంతసించును. లోభియై యేమియు నీయకున్నఁ జిన్నవోవును. మాటల సందర్భమునఁ జెప్పితిని గాని ని న్నేయర్థము యాచింపఁ దలఁచిరాలేదు.

నాకు నీవు చేయవలయు సాయ మాహార మొసఁగుట మాత్రమే. పూర్వమునుండియు నేను చెనఁటులగు మానవుల రక్తముఁ ద్రావుచుంటిని. యెన్నఁడు మహీపతుల రక్తము గ్రోలి యుండలేదు. అందువలన నాకు సంపూర్ణ సంతృప్తి గలుగలేదు. ఆకోరిక నెఱవేర్చుకొనుటకై నేఁడు నీదర్శనము నకు వచ్చితిని. కావున నాయభిమత మంగీకరించి నన్ను సంతోష పెట్టుము.

నాకిట్టి యభిలాష పుట్టుటకుఁ గారణమేమన; రాజులు మహా భోగులు అమూల్యములై రసవంతములైన బహువిధ భోజ్య పదార్థములు వారు భక్షింతురు. మిక్కిలి పరిమళము గల రకరకములయిన సుగంధ ద్రవ్యముల నుపయోగింతురు. అనుదినము విలాసవతులయిన కోమలాంగులతో సకల సుఖము అనుభవింతురు. అట్టివారి రుధిర పానమునకై యెన్నియో తావులఁ దిరిగి యుంటిని. ఇంతవఱకు నాయభిలాషము సిద్ధింప లేదు."

డిండికము మాటలు విని, జాలిగొని దాని యభిలాష కంగీకరించి మందవిసర్పిణి యిట్లనెను. "కడు జాగరూకతతో వర్తింపుము. వేగిరపాటుఁ జెంది కార్యహానిఁ దెచ్చుకొనకుము. రాజు గాఢ నిద్రాపరవశుఁడై యున్న తఱి నాతని రక్తముఁ గ్రోలి తటాలునఁ దప్పుకొనవలయును.

ఉపాయ మెఱుఁగక కక్కుఱితిపడి సంజజామున నాతని గఱచిన యెడల మనకుఁ బ్రమాదము కలుగవచ్చును.

ఇట్లు బోధించిన యనంతరము మందవిసర్పిణియు, డిండికము నాశయ్యయందుఁ బ్రీతితో నుండెను. కొంతసేపయిన తరువాతఁ జీరపేను కునుకు దీసెను. అపు డభిలాష నిలుపుకొనలేక యానల్లి సందెజామునసే భూమీశునిఁ గఱచెను. అంతట నిద్రాశూన్యుఁడై యున్న యా రా జదరిపడి, పాదము లొత్తుచున్న సేవకులతో "దీపము దెచ్చి చూడుఁడు. నా దేహమున దేలుకుట్టిన యట్లైనది" అని పలికెను.

సేవకులు దీపము దెచ్చునంతలో డిండికము కడు వేగముగా మంచము పట్టె రంధ్రములోనికిఁ బోయి దాగుకొనెను. సేవకులు దానిం గనుఁగొనక పాన్పు నడుమ నేమియు నెఱుంగక కునుకుచున్న మందవిసర్పిణిం జంపివైచిరి." కావున నూతనాగంతుకుని నమ్మి చేరనీయరాదు.

రాజు "ఆగంతుకులు నొకపుడు మహోపకారము జేయఁగలరు. పరుఁడైన నొకపుడు మేలుకూర్చు బంధువగును. బంధువు నొకప్పుడు పరుఁడై కీడొనరించును. స్వశరీరమున జనించిన దైనను వ్యాధి యపాయకరము. అడవిలోఁ బుట్టినదైన నౌషధి మేలొనరించును గదా! వీరవరుఁ డను నొక యాగంతుకుఁడు శూద్రక మహారాజు నచిరకాలముననే తనకుమారుని ప్రాణము లొసఁగి కాపాడఁబోయెను. నీ కా కథ వినిచెద వినుము.

వీరవరుఁడు తన కుమారుని ప్రాణము లొసఁగి శూద్రక మహారాజును గాపాడఁబోయిన కథ

నేను పూర్వము శూద్రకమహారాజు క్రీడాసరస్సునందలి కర్పూరకేళియను రాజహంస పుత్రికయగు కర్పూరమంజరిపై వలపుగలిగి యుంటిని. అపు డచటికి వీరవరుఁ డను నొక మహారాజపుత్రుఁ డేదేశమునుండియో వచ్చి రాజద్వారమునొద్దకు వెళ్లి ద్వారపాలకునితోఁ దా నొక రాజపుత్రుఁడ నియు, రాజదర్శనమునకై వచ్చితి ననియుఁ జెప్పెను. ద్వారపాలకుఁ డాతని

రాజదర్శనమునకు గొంపోయెను. వీరవరుఁడు ప్రభూ! ఈ సేవకుని సేవ తమకంగీకార మగుచో దినమున కైదువందల సువర్ణముల జీత మేర్పఱుపుఁ డని కోరెను. దానికి రాజు 'నీయొద్ద గల సరకేమి' యని ప్రశ్నింప నాతఁడు 'రెండు బాహువులు, నొక ఖడ్గము' నని బదులు వలికెను. 'అంతమాత్రము చాల' దని రాజనఁగా వీరవరుఁడు కదలిపోయెను.

అపుడు మంత్రి 'నాలుగు రోజులా వేతనమిచ్చి యాతని సామర్థ్య మెఱుంగవచ్చు' నని పలుక రాజు వీరవరునిఁ బిలిపించి తాంబూలముతోఁ బంచశత సువర్ణము లొసగెను. ఆసొమ్ము దీసికొని, యాతఁడు దేవబ్రాహ్మణుల నిమిత్త మందు సగము ఖర్చుపెట్టెను. మిగిలినదానిలో సగము దీనుల కొసఁగెను. మిగిలినది భోజ్యవస్తువులకు, విలాసవస్తువులకు నుపయోగించెను. ఇట్లు నిత్యకృత్య మొనరించుచుఁ గత్తి చేతఁబూని రేయుంబవళ్లు రాజద్వారమును గనిపెట్టుకొని సేవించుచుండెను. రాజు సెలవైనపుడు మాత్రమే యింటి కేఁగుచుండెను.

పిమ్మట నొకనాఁటి రాత్రి రాజున కొక రోదనధ్వని వినఁబడెను. ద్వారమందున్న వీరవరునిఁ బిలిచి 'యా రోదన మేమో తెలిసికొని ర' మ్మనెను. వీరవరుఁడు సెలవుగైకొని వెడలిన పిమ్మట 'గాఢాంధకారమున నీ రాకొమరునిఁ బంపితిని. నేను నీతనివెంట నేఁగి విషయము దెలిసికొందు' నని తలఁచి శూద్రకమహారాజును బయలుదేఱెను.

వీరవరుఁ డట్లు వెడలి రూపయౌవన సంపన్నురాలును, సర్వాలంకారములును ధరించినదియు నగు నొకసుందరింగాంచి 'నీవెవ్వతెవు? యేల యేడ్చుచుంటి వని యడిగెను. "నేనీ శూద్రకుని రాజ్యలక్ష్మిని. చిరకాలమునుండి యీతని బాహువుల నీడను సుఖముగా విశ్రమించియుంటిని. ఇపుడు వేఱొక్కచోటికిఁ బోవలసివచ్చినది" అని యామె బదులు పలుకగా వీరవరుడు "అపాయమున్నచోట నుపాయముగూడ నుండును. కావున; నీ విచటనే యుండుటకుఁ దగు నుపాయ మేమైనఁ దెలుపు" మని మరల నడిగెను. 'ముప్పదిరెండు శుభలక్షణములతోఁ గూడిన నీసుతుఁడగు శక్తిధరుని నీవు భగవతియగు సర్వమంగళకు బలియొసంగినచో నే నిచ్చోట గదలక చిరకాలము సుఖముగా నివసింపఁగల' నని పలికి యామె యంతర్ధాన మయ్యెను.

వీరవరుఁ డంతట నింటికేఁగి నిద్రించుచున్న సతిని, సుతుని మేలుకొలిపెను. వారు మేలుకొని లేచి కూరుచుండిరి. వీరవరుఁడు రాజ్యలక్ష్మి తెలిపిన సంగతి యంతయు వారికిఁ బూసగ్రుచ్చినటులువివరించెను. అదివిని యానందముతో శక్తిధరుఁడు 'స్వామిని, రాజ్యమును గాపాడు నిమిత్త ముపయోగపడుట వలన నేను మిక్కిలి ధన్యుఁడను. ఇందుల కిఁక నాలసింపనేల? ప్రాజ్ఞుఁడు సకలసంపదలును, తుదకు జీవితమును పరార్థమై విడువఁగలఁడు. వినాశ మెపుడో యొకప్పుడు తప్పనపు డిట్టి వినియోగము మేలుకదా!" యన విని యాతని తల్లి యిటులు

పలికెను. "ప్రభువునొద్ద గొప్పజీతము తీసికొనుచు సమయము వచ్చినపు డిట్టి యుపకారముఁ జేయకున్న నాతని ఋణ మిం కేవిధమునఁ దీర్పఁగలము ?"

అనంతర మందఱు గలిసి సర్వమంగళాలయమునకు వెళ్ళిరి. అచట దేవిని బూజించి వీరవరుఁడు. "తల్లీ ! ప్రసన్నురాలవుగమ్ము. నీ వీ కానుకను స్వీకరించి శూద్రకమహారాజునకు శాశ్వతజయము గూర్పుము" అని ప్రార్థించి సుతుని తల నఱకివైచెను. పిమ్మట నాతఁ డిటులు చింతించెను. "వేతనము దీసికొన్నందుకు రాజఋణము దీఱినది. ఇక నపుత్రకుఁడనై జీవించుట దుష్కరము" అని తలపోసి తన శిరమునుగూడ ఖండించుకొనెను. పతి సుత శోకమునకు దాళఁజాలక సతియు నటులే యొనరించెను.

చాటున నుండి యదియంతయుఁ జూచుచున్న రాజాశ్చర్యముతో నిటు లాలోచించెను. "నాబోటి క్షుద్రులనేకులు జనించు చుండిరి ; గిట్టుచుండిరి. ఈతనికి సాటి రాఁదగువారు భూతభవిష్యద్వర్తమానములలో నెవ్వరు నుండరు. ఈతఁడు చనిపోయి నపుడు నాకు రాజ్యముండియు నిరుపయోగము." అని తలఁచి శూద్రకుఁడు తన శిరము ఛేదించుకొనుటకై కత్తి యెత్తెను. అపుడు భగవతియగు సర్వమంగళ శూద్రకుని చేయిపట్టుకొని నిలిపి "కుమారా ! నీ సాహసమునకు మెచ్చి నీయెడఁ బ్రసన్నురాలనయితిని. మరణానంతరమైన నీ రాజ్యమున కేహానియుఁ గలుగదు"

నావుడు రాజు సాష్టాంగ నమస్కారము చేసి "తల్లీ! నాకిఁక రాజ్యమేల? జీవితము మాత్రమేల? నీకు నాయందుఁ గరుణగలదేని నా యాయుశ్శేషమును గ్రహించి వీరవరుఁడు సతీసుత సమేతముగా జీవించునటు లనుగ్రహింపుము. కానిచో నాగతికి నన్ను వదలుము." అని వేడికొనెను.

రాజు మాటలు విని యామె "కుమారా! నీ సేవక వాత్సల్యమునకు నీయెడఁ గడు సంతుష్టురాల నైతిని. పొమ్ము విజయము నొందుము. ఈ వీరవరుఁడును నాలుబిడ్డలతో జీవించును." అని పలికి యదృశ్యురాలయ్యెను.

అనంతరము వీరవరుఁడు కుటుంబముతోఁగూడి యింటికిఁ బోయెను. రాజును వారలకు తెలియకుండ శీఘ్రముగా నంతిపురముఁ జేరెను.

మఱునాఁ డుదయమున రాజు ద్వారమందున్న వీర వరుఁ జూచెను. "ప్రభూ! ఆ యేడ్చుచున్న యామె నన్ను జూచి యదృశ్యురాలయ్యెను. మఱొక విశేషమేమియు లే" దని యాతఁడు ప్రభువునకు విన్నవించెను. ఆపలుకులు విని 'యీతఁ డెంతటి మహాసత్త్వసంపన్నుఁడు? ఈతని నేమని కొనియాడుదును?

దైన్యము నెన్నఁడు తనయందుఁ దోఁప నీయక ఆత్మ స్తుతి చేసికొనక, ప్రియవాక్యముల బలుకుచు, దానగుణము గలవాఁడై, యపాత్రుని కొనఁగక నిష్ఠురోక్తు లాడక యుండు

వాఁడేకదా శూరుఁడనఁదగు. మహాపురుష లక్షణములన్నియు నీతని యందున్నవి" అని రాజు తలపోసి పిమ్మట శిష్టసభను సమావేశ పఱచి జరిగిన యావృత్తాంతముఁ దెలిపి, పొగడి వీర వరునకుఁగానుకగాఁ గర్ణాట రాజ్యమొసంగెను. కావున నాగంతుకుఁడైనపాత్రన, జాతిమాత్రదుష్టుడైనంత మాత్రమున నట్లన రాదు. వారిలోనుత్తమ మధ్యమాధము లుండవచ్చును. "అని హిరణ్యగర్భుఁడు వినిపింపఁగా మంత్రి చక్రవాక మిటులనియె.

ఎవ్వఁ డకార్యము జరుగుచుండ నది కర్తవ్యముగా నంగీకరించునో వాఁడు దుర్మంత్రి యనఁబడును. అకార్యమున కంగీకరించి ప్రభువునకు నాశకారకు డగుటకన్న ప్రభువునకుఁ దాత్కాలిక మనోదుఃఖము గలిగించినను దప్పు కానేరదు. వైద్యుఁడు, గురువు, మంత్రి యను మూవురు నేరాజుకడ ముఖప్రీతి కలిగించు మాట లాడుదురో యాతఁడు శరీరము నుండియు, ధర్మమునుండియు, కోశమునుండియు భ్రష్టుఁడై నశించుచున్నాఁడు. పుణ్యవశమున నెవ్వరికో లభించిన యర్థము నాకును దొరకు ననుకొనఁదగదు. నిధులు దొరకునను నాసతో భిక్షుకుని జంపి యొక మంగలి హానిం జెందెను. నీకాకథ వివరింతు నవధరింపుము.

క్షపణకులనుగొట్టి నిధులు పొందిన క్షత్రియుని గాథ

అయోధ్యానగరమున జూడామణి యను క్షత్రియుఁ డొకఁ డుండెను. ఆతఁడు ధనమునుగోరి కడు శ్రమల కోర్చి

చాలకాలము శివు నారాధించెను. కొంతకాలమున కాతః పాపములు నశించుటవలన నీశ్వరుని పనుపునఁ గుబేరుఁ డాతః కలలోఁ గానఁబడి "నీ వుదయము క్షౌరము గావించుకొని దుడ్డుకఱ్ఱ యొకటి జేతఁబట్టుకొని యింటియందు నడిగాకుండ నుండుము. అపుడే వీథిని వచ్చు నొక భిక్షుకునిఁ జూడఁగలఁవు. అతనిపట్ల నెంతమాత్రము జాలిదలఁపక యీదండముచే నాతనిఁ గొట్టుము. అనంతర మా భిక్షుకుఁడు బంగరు గిన్నెగా మాఱి పోవును. దానితో నీవు యావజ్జీము సుఖింపవచ్చు" నని పలికెను. చూడామణియు నాప్రకార మొనరించి సంపదల నొందెను.

భిక్షుకులనుగొట్టి యురి తీయబడిన మంగలి కథ

చూడామణికి క్షౌర మొనరించుటకు వచ్చిన మంగలి యిది యంతయుఁ జూచి 'నిధులు దొరుకవలె నన్న నిది యుపాయము గాబోలును; నేను నటులేచేసి సంపదల నార్జింతును' అని తలచి, దండము చేతఁబట్టి ప్రతిదినము భిక్షుకుని రాకకై యెదురుచూచుచుండెను. ఒకనాఁడు దురదృష్టవంతుఁ డగు నొక భిక్షుకుఁడు రాఁగా నాతనిఁ జావమోదెను. ఆ యపరాధమునకు రాజపురుషు లామంగలిని గొనిపోయి యురి తీసిరి."

అట్లు మంత్రిచెప్పిన కథ విని రాజు 'పూర్వపుకథలు చెప్పుకొని యొకఁడు విశ్వాసఘాతుకుఁడో, యకారణ బంధువో నిర్ణయించుట తేలిక కాదు. సరే, అదియటుండనిమ్ము. శత్రు రాజు చిత్రకర్ణుఁడు మలయపర్వతమున నున్నచో నివు డేమి

చేయఁదగు' నని ప్రశ్నింప మంత్రి 'ప్రభూ ! మనము పంపిన దూతవలన చిత్రవర్ణుఁ డాతని మహామంత్రియగు గృధ్రము సహాలను గౌరవించుట లేదని వింటిని. కావున నాతఁడు మూఢుఁడని, సులభముగా గెలువవచ్చునని నాతని తలఁపు."

'లుబ్ధుఁడు, క్రూరుఁడు, అలసుఁడు, నసత్యవంతుఁడు, పొరపడువాఁడు, భీరుఁడు, చంచలుఁడు, మూఢుఁడు, యోధుల నవమానించువాఁడు నగు శత్రువు సులభముగా జయింపఁబడు'నని పెద్దలవచనము కావున నాతఁడు మనకోట నరికట్టకముందే నద్యద్రివనమార్గముల యందు వానిబలములను హతమార్చుటకు సారస్వతాది సేనాపతులను నియోగింప వలయును. 'దూరప్రయాణముచే నలసినవానిని, నద్యద్రి వనములఁ జిక్కుకొన్నవానిని, ఘోరాగ్నికిఁ బాలుపడినవానిని, నాకలిదప్పులకు లోనైనవానిని, వ్యాధులచేతను దుర్భిక్షముల చేతను బీడింపఁబడినవానిని, దోపిడిగాండ్ర బాధకు లోనైన వానిని మీఁదఁబడి నాశనము చేయవలయు' నని యార్యు లందురు. 'శత్రువులు మీఁదఁ బడుదురను భయమున రాత్రి యంతయు మేలుకొని ; పగలు సైనికులందఱు నిద్రింప దానును నిద్రించు శత్రువును జుట్టుముట్టి చంపివేయవలెను.' అనియు నార్యుల వచనము. గావున నావిధముగా బ్రమాదములకుఁ బాలయిన శత్రుసేనఁజొచ్చి రేలుంబవళ్ళు మన సేనాను లు చంపఁగలరు." అని వచించెను.

ఆప్రకారము కావింపగాఁ జిత్రవర్ణుని సైనికులు, సేనానులు పెక్కుమంది మరణించిరి. చిత్రవర్ణుఁ డపుడు మిక్కిలి కలఁతనొంది తన మంత్రియగు దూరదర్శి కిట్లనియె.

“పూజ్యుఁడా! యిట్టి సమయమున నన్ను పేక్షింపఁ దగునా? నాయందపరాధమేమైనఁ గలదా? రాజ్యము లభించినదని గర్వముతో నడువఁ దగదు. ముసలితనము సౌందర్యమును హరించినట్లు వినయము సంపదలను హరించును. శక్తివంతుడు సంపదల నొందును. పథ్యముఁ గోరువాఁడే నీరోగత నొందును. అరోగి సుఖము నొందును. కృషిగలవాఁడు విద్యల నొందును. కాని వినయవంతుడు ధర్మము, నర్థము యశముఁ గూడ నొందఁగలడు” నా విని మంత్రి గృధ్ర మిటు లనియెను.

“జల సమీపమున నుండు వృక్షము పల్లవ కుసుమ ఫలములతో నొప్పారునట్లు రాజు తా నవిద్వాంసుఁడైనను విద్యావృద్ధులను సేవించి గొప్పసంపదల నొందఁగలఁడు. మఱియు మద్యపానము, స్త్రీ వ్యామోహము, వేఁట, జూదము, అర్థదూషణము, మాట బిరుసుఁదనము, కఠిన దండనము నను నవి రాజున కుండరాని సప్తవ్యసనములు.

కేవలము సాహసమువలన గాని, కేవల ముపాయములవలనఁగాని యున్నత సంపదలు గలుగవు. సమయానుగుణముగా నీతి శౌర్యములు చూపు వారికి సంపదలు దమంతదామే వచ్చి చేరును. నీవు సేనల యందలి యుత్సాహముఁ

జూచి యతిసాహస మొనరించి, నే నుపదేశించిన మంత్రాలోచనమం దనాదరమును, వాక్పారుష్యమును జూపితివి. ఆ యవినీతికి ఫల మిపు డనుభవించుచుంటివి.

దుర్మంత్రము గలవానిని నీతిదోషములు తాఁకును. అపథ్యము భుజించువానిని రోగము లాశ్రయించును. శ్రీగర్వితుని మృత్యువు సమీపింపకమానదు. స్త్రీవాంఛ లెవ్వనికిఁ బరితాపముఁ గూర్పకుండును? ముదమును విషాదము, శరత్కాలమును హిమాగమము, సూర్యుడు చీకటిని, కృతఘ్నత సుకృతమును, మైత్రి దుఃఖమును, నీతి యాపదలను హరించిన విధమున సమృద్ధమైన సంపదలను గూడ దుర్నీతి నాశనము చేయును." అని పలికి మనమున నిట్లు తలపోసెను. "రాజిపుడు ప్రజ్ఞాహీనుఁ డయ్యెను. కాకున్నచో నీతిశాస్త్రమును వెన్నెలను వాక్కు లనెడి కాగడాలచేతఁ జెడగొట్టునా? ఎవ్వానికి సహజముగఁ బ్రజ్ఞయుండదో వానికి శాస్త్రము మాత్రమేమి మేలు చేయగలదు? లోచనములు లేని వాని కద్ద ముపయోగింపదు గదా!" అని యాలోచించి యూరకుండెను.

పిమ్మట రాజు దోసిలొగ్గి "పూజ్యుఁడా! నాతప్పు సైరింపుము. నేను మిగిలిన సేనతో మరల వింధ్యాచలముఁ జేరు నుపాయముఁ దెలుపుము" నావుఁడు మంత్రి "యిఁక గోప ముడిగి, యుపాయము వెదుకవలెను. ఏలయన 'దేవతలందును, గురునియందును, గోవులయందును, బ్రాహ్మణుల యందును, రాజులయందును, బాలవృద్ధాతురులయందును కోపము సూప

రా' దని పెద్దల వచనము " అని మనమునఁ దర్కించి చిఱునగవుతో రాజున కిటులనియె.

"ప్రభూ ! భీతిఁ జెందకుము. ఊరడిలుము. సన్నిపాత రోగముఁ గుదుర్చుటలో వైద్యుల ప్రజ్ఞ వెల్లడియగునట్లు చెడిన వ్యవహారములు చక్కఁబఱచు పట్టుననే మంత్రుల ప్రజ్ఞ వెల్లడి కావలయును. అన్నియుఁ జక్కగా నున్నపు డందఱును బండితులే యగుదురు. అజ్ఞులు సామాన్యపు యత్నములు ప్రారంభించి యవి నెరవేర్పలేక సతమతమగుచుందురు. ప్రజ్ఞావంతులు మహాయత్నముల నే సంకోచములేక నెరవేర్చుకొనఁ గలరు. కావున నీప్రతాపము వలననే కోటను భేదించి కీర్తి పరాక్రమ సహితముగా శీఘ్రకాలముననే వింధ్య పర్వతమునకుఁ గొనిపోవఁగలను."

ఆపలుకులువిని రాజు 'ప్రస్తుత మత్యల్పబలముతో నది యెట్లు శక్యమగు' నని యడిగెను. "దేవా ! సర్వము సమకూఱును. జయమం దిచ్ఛగలవాఁడు కేవలము సూత్రములు పన్నుకొనుచుఁ గూర్చుండరాదు. కావునఁ ద్వరితముగా దుర్గముఁ జుట్టుముట్టి యరికట్టవలయును." అని మంత్రి బదులు పలికెను.

గూఢచారిగాఁ బంపబడిన బకము హిరణ్యగర్భుని దగ్గఱకేఁగి 'ప్రభూ ! అల్పమగు సేన గలిగియు రాజగు చిత్రవర్ణుఁడు మంత్రి గృధ్ర ముపదేశించుటచేఁ గోట నరికట్టు

చున్నాఁడు' అని యెఱింగించెను. అపుడా రాయంచ 'సర్వజ్ఞా! యిపు డేమి చేయఁదగు' నని మంత్రి నడిగెను.

"మనసైనికులలో సారాసారపరిశీలనముఁజేసి, యవస్థా తలను బట్టి సువర్ణవస్త్రాదికములగు కానుక లొసఁగి వారి నుత్సాహపఱుపవలయును. ఒక్కకానియైన ననవసరముగాఁ బోవునపు డది పదివేలుగా భావించి కాపాడవలయును. కాలము వచ్చినపుడు కోట్లకొలఁది ద్రవ్యమైనను గవ్వలవలె వెచ్చించుటకు వెనుకాడరాదు. ఇటు లొనరించు రాజసింహుని లక్ష్మి యెన్నఁడును వరించియుండును? యాగమున, వివాహమున, వ్యసనమున, రిపునాశనమందు, యశమును గలిగించుకార్యమున, మిత్రులను సంపాదించుటయందు, ప్రియురాండ్ర విషయమున, నిర్ధనులగు బంధువులయెడ నీయెనిమిది సందర్భములలోను నతివ్యయ మని తలఁపక యెంతయైన వెచ్చింపవచ్చును. కొలఁదిఖర్చునకు వెనుదీసి సర్వనాశముఁ దెచ్చుకొనువాఁడు మూర్ఖుఁడు. బుద్ధిమంతుఁ డెవ్వఁడైనను పన్నిచ్చుటకు జంకి భాండము విడిచి పోవునా?" యను చక్రవాకము సలహావిని "యీవిపరీత సమయమున దుబారాఖర్చుతగునా?" యని రాజహంస పలుక "ప్రభూ! సంకోచింపక దానమానములచే యోధుల నుత్సాహపఱుపుము. మన మెంతభద్రపఱచినను సమయము వచ్చినపుడు సంపద సంవ్యయమైపోవును. గౌరవాభిమానములచే దుష్టులగు యోధు లవలీలగా శత్రువుల జయింపఁగలరు. శీల సంపన్నులుం, నుత్సాహవంతులుఁ, గృతనిశ్చయులు నగు శూరు

లై దువందలమందియున్న నెంతశత్రుసేననైన నఁ జెండాడఁగలరు. మఱియు సత్యము; శౌర్యము; దయ; త్యాగము ననునవి రాజున కుండవలసిన మహాగుణములు. ఈయవి లేకున్న వానికి నిందగలుగును.

ఇట్టి సమయములనే మంత్రులమాట చేకొనఁదగును. మేలుకీడులం దెవ్వఁడు పాలుగొనునో యట్టిసచివుని నమ్మి ధనప్రాణములయం దుపయోగించుకొనవలయును. ఎవనిమంత్రి ధూర్తుఁడును, స్త్రీయును, ననుభవశూన్యుఁడగు చిన్నవాఁడు నగునో యట్టిరాజవినీతివాయువు తాఁకునఁ గార్యసముద్రమున మునిఁగిపోయి, తేలకుండును. హర్షక్రోధములయందు సమబుద్ధియు శాస్త్రార్థముల యందు విశ్వాసము, సేవకులయం దెపుడు ననుపేక్షయుఁ గలుగు రాజునకు ధరిత్రి యెపుడును సంపద లొసఁగును. 'హానివృద్ధులు రాజుతోడివే' యని తలఁచు మంత్రుల నెన్నఁడు నవమానింపఁ జనదు" అని పలుకుచుండెను.

ఈసమయమున మేఘవర్ణుఁడు వచ్చి నమస్కరించి "ప్రభూ! యుద్ధముఁగోరి శత్రువు దుర్గద్వారము నరికట్టియున్నవాఁడు. కావున దేవరయాజ్ఞయిచ్చినచో దుర్గమువెలువడి నాపరాక్రమముఁ జూపి ప్రభువులఋణము దీర్చుకొందు" నని విన్నవించెను.

దానికిఁ జక్కవ యిటులనియె. "బయటికి వెడలి యుద్ధము చేయఁదగినయెడల దుర్గము నాశ్రయించుట నిరుప

యోగము. నీటియం దెంత బలిష్ఠ మైనను మొసలి బయటికి వచ్చిన నిర్వీర్యమయి లొంగిపోవును. మహాఘోరమయిన సింహముగూడ నడవినుండి వెలువడి వెల్లడితావులలో నక్క వలెఁ జిక్కిపోవును. మరియుఁ బ్రభూ! స్వయముగా నేఁగి యుద్ధము చూచెదరుగాక. రాజు సేనలను ముం దుంచుకొని పరిశీలనచేయుచు యుద్ధ మొనరింపవలయును. స్వామి ప్రక్క నుండగా గుక్కయైనను సింహవిక్రమముఁ జూపునుగదా!"

యుద్ధము

అనంతర మందఱు నేఁగి దుర్గద్వారమునొద్ద సంగరము చేసిరి. మఱుచటి దినమునఁ జిత్రవర్ణుఁడు గృధ్రముతో 'ఆర్యా! నీప్రతిజ్ఞ నెఱవేర్చు కొనవలసిన సమయము మిదియే, యనెను.

దానికి దీర్ఘదర్శి "రాజా! కాలమును సహింపనిదియు నత్యల్పమగునదియు; మూర్ఖుఁడు, వ్యసనవంతుఁడు నాయ కుఁడు గాగలదియు; గుప్తము కానిదియు; భీరులగు యోధు లుగలదియు నగుట దుర్గవ్యసన మనఁబడును. అది యచట నెంతమాత్రమును గానరాదు. భేదోపాయమును, చిరకాలము ముట్టడించుటయు, నిద్రాసమయమునఁ బై బడుటయు, తీవ్ర పౌరుషముఁ జూపుటయు నను నాలుగును కోటను వశపఱచు కొను నుపాయములు. ఈవిషయమున యథాశక్తిగా యత్నముఁ జేయుచుంటి" నని పలికి చెవిలో నింక నేమియో చెప్పెను.

మేఘవర్ణుని మోసము

మఱుచటి దినమున సూర్యోఁ డుదయింపకమున్నే నల గడల నాలుగు దుర్గద్వారములందు యుద్ధము జరుగుచుండగా గోట నడిమి గృహములం దొక్కసారిగాఁ గాకు లగ్ని ముట్టించినవి. పిమ్మటఁ 'గోటలాంగిపోయెఁ; గోటపడిపోయె' నను కోలాహలము విని మండుచున్న యగ్నిజ్వాలలు చూచి రాజహంస సైనికులును, నితర దుర్గవాసులను నగు పక్షులన్నియు శీఘ్రముగా జలాశయప్రవేశ మొనర్చినవి. మంత్రాలోచనము, విక్రమము, యుద్ధము, పలాయనము సమయానుసారముగ నలుపవలెఁ గాని వెనుదీయరాదు.

సారసపక్షి స్వామిభక్తి

సహజముగా మందగతియగు రాజహంస సారసద్వి యుడై చిత్రవర్ణుని సేనాపతియగు కుక్కుటముచే నిరోధింపబడెను. అపుడు రాజ హంస 'సేనాపతీ! నన్ననుసరించి యుం యేల మరణమున కెరయగుదువు? నీవు శీఘ్రముగా నిష్ఠైనఁ దప్పించుకొనిపోఁగలవు. కావున నట్లు పోయి, జలము జొచ్చి యసువులు గాపాడుకొనుము. నాకొమరుఁడు చూడామణి యనువానిని సర్వజ్ఞుని సమ్మతితో రాజు నొనరింపుము. నావుడు సారస మిటు లనియెను.

'ప్రభూ! ఇట్టి మాటలు విననొల్లను. ప్రభువునకు జంద్ర దివాకరు లున్నంతకాలము విజయము గలుగుఁగాక! నేన

తమదుర్గమున కధికారిని. నా రక్తమాంసములచేఁ బూయఁ బడిన ద్వారమార్గమున మాత్రమే శత్రువు దుర్గమునఁ జొరఁ గలఁడు. మఱియును దాతయు, నోరిమి గలవాఁడును, గుణములు గ్రహింపఁగలవాఁడును నగు ప్రభు వెంతయదృష్టముననో కాని లభింపఁడు.' నావుడు రాజు 'అది సత్యమేయయినను సమర్థుఁడుఁ, బవిత్రుఁడు, ననురాగవంతుఁడునగు సేవకుఁడు దుర్లభుఁ' డనియెను.

"ప్రభూ! యుద్ధమునుండి తొలఁగిన నీకు మరణభయము లేకుండుట స్థిరమైనచో మఱొకచోటికిఁ బాఱిపోవచ్చును. పుట్టిన ప్రతిప్రాణికి మరణ మెపుడో యొకప్పుడు తప్పని దైనపుడు యుద్ధమునుండి తప్పుకొని కీర్తి నేల మలినపఱచుకొనవలయును? గాలితాఁకునఁ గలుగు కెరటముల తిరుగుడుచే నేర్పడిన సుడిగుండమువలె క్షణభంగురమైన యీజన్మయందుఁ బరులనిమిత్తము జీవితము నర్పించు యోగము మహాపుణ్యమువలనఁ గలుగును.

ప్రభువు, అమాత్యుఁడు, రాష్ట్రము, కోట, కోశము, సేన మిత్రుఁడు, పౌరశ్రేణులు ననునవి రాజ్యాంగములగు సప్తప్రకృతులు. అందుప్రభుఁడవగు నీవు సర్వవిధముల రక్షింపఁబడఁదగినవాఁడవు. ప్రకృతివర్గము సంపూర్ణమయ్యును ప్రభువు లేనిదే నిలువఁజాలదు.

వైద్యుఁడు ధన్వంతరియైన నాయుర్దాయము లేనివాని విషయమున నేమిచేయఁగలఁడు? సూర్యుని యుదయాస్తమయములననుసరించి కమలము వికసించుట, ముకుళించుట జరుగు

నట్లు రా జభ్యుదయమున నున్నపుడు ప్రజలు సుఖింతురు, రాజు హాని నొందునపుడు ప్రజలును కీడునొందుదురు" అని పలుకు చుండఁగాఁ గుక్కుటమువచ్చి రాజహంస శరీరమున వాడియైన గోళ్ళతోఁ బొడిచెను. అపుడు సారసపక్షి శీఘ్రముగా రాజ హంసను దన దేహమం దిడుకొని భద్రముగా సరోవరజలమం దునిచెను.

అపుడు కుక్కుటములన్నియుఁ జుట్టుముట్టి సారసము దేహమంతయును దూంట్లువడునట్లు పొడిచెను. సారసమును దన విక్రమముఁజూపి కుక్కుటసేనను జాలవఱకు నంత మొందిం చెను. కుక్కుటములు లెక్కలేనన్ని యగుటచే నన్నియుఁ గలిసి ముక్కులతోఁ బొడిచి తుదకు సారసముం జంపివైచినవి.

అనంతరము చిత్రవర్ణుఁడు దుర్గమునుజొచ్చి దుర్గమం దలి విస్తారమైన ద్రవ్యము దీసికొని, వందిజనులు, జయజయ ధ్వనులు చేయుచుండ స్కంధావారము కేఁగెను.

విష్ణుశర్మ యిట్లు చెప్పుచుండఁ రాజకుమారు లిట్టు లనిరి. 'రాజహంస సేనయందు స్వదేహమును త్యాగముచేసి ప్రభువును రక్షించిన సారసపక్షి సుకృతము కడు శ్లాఘ్యము. సర్వగోవులును ధేనువు నాకృతిగల వత్సములఁ బెక్కింటిని గను చున్నవి. కొమ్ములు, మూఁపును దాఁకునట్టి ప్రశస్తమైన యాబోఁతు మాత్ర మేయొక్క గోవునకో జనించును' నావిని విష్ణుశర్మ యిట్లనియె.

"విద్యాధరస్త్రీలు పరిజనమై కొలువ మహాసత్త్వుఁడగు నాసారసము స్వర్గసుఖ మనుభవించును. యుద్ధమునఁ బ్రభువు నిమిత్తమై, దేశము నిమిత్తమై శరీరములఁ గోలుపోవు నట్టి కృతజ్ఞులగు ప్రభుభక్తులు స్వర్గము నొందుదురు. పందతనము వహింపక యుద్ధరంగమున నెచ్చోట శత్రువులచేఁ జంపఁబడిన శూరుఁడును నక్షయపుణ్యలోకము నొందును. పర మహీపతుల కరితురంగ పదాతిసేనలతో నెన్నఁడు మీకు యుద్ధము సంభవింపకుండునుగాక ! నీతిమంత్రవాయువులచేఁ జెదరగొట్టఁబడి మీవైరులు గిరి గహ్వరముల నాశ్రయింతురుగాక !"

సంధి

అనంతరము రాజపుత్రులు విష్ణుశర్మతో "ఆర్యా! తమ దయవలన విగ్రహము సాంతముగా వింటిమి. ఇపుడు సంధిని గుఱించి మాకుఁ దెలుపు"మని కోరఁగా విష్ణుశర్మ యిట్లు చెప్పఁ దొడఁగెను.

"రాజహంస జలాశయముఁ జేరినపిమ్మటఁ జక్రవాక మంత్రితో "మనదుర్గమున నిప్పుముట్టించినవాఁ డెవ్వఁడు? మన కోటలోని వాఁడే యిట్లు చేసెనా? లేక శత్రువులచేఁ బంపఁ బడిన మఱెవ్వఁడైనఁ గావించియుండునా?" యని పలికెను.

అపుడు మంత్రి "ప్రభూ! మీనిష్కారణ బంధువగు మేఘవర్ణుఁడు సపరివారముగా నదృశ్యుఁడయ్యె; నీపని యాతఁడే యొనరించి యుండునని నాయూహ." నావుడు రాజు క్షణ మాలోచించి "యీ దురదృష్టమునకుఁ గర్త దైవము. మఱెవ్వరుఁ గారు. ఒకపుడు చక్కఁగా నాలోచించి చేసిన పనియు దైవయోగమువలన నాశనమగుదును గదా!" యని పలికెను. ఆ మాటలు విని మంత్రి యిటు లనియె.

"కార్యము విఫలమైనపుడు మానవుఁ డవివేకియై దైవము నిందించునే కాని తన యనాలోచిత కృత్యములఁ దెలిసి కొనఁజాలఁడు. హితమునుగోరు మిత్రుల వాక్యముల విననివాఁడు నోటిపట్టు వీడి పడి చెడిన కూర్మమువలె హానిఁ జెందును. నీ కా కథ దెలుపుదును. వినుము.

హితవాక్యములు వినక చెడిన కూర్మము కథ

మగధ దేశమున ఫుల్లోత్పల మను నొక్క సరస్సు గలదు. సంకట వికటములను పేరుగల రెండు హంస లందు నివసించుచుండును. వానికి మిత్రమై కంబుగ్రీవమను నొక్క కూర్మము గూడ నుండెను. ఒకనాఁడు జాలరు లాసమీప మునకు వచ్చి 'నేఁ డిచటనుండి రేపటియుదయమున నీ కొలని యందలి మత్స్య కూర్మాదులఁ బట్టుకొంద' మని తమలోఁదాము చెప్పుకొనిరి. ఆమాటలు విన్న తాఁబేలు హంసలతో నిటు లనియెను. 'ఇపుడు మనకుఁ గర్తవ్య మేమి?' 'ప్రాతఃకాల మున నేదోయొక యుపాయ మాలోచింతము ఈ లోగానే యంతప్రమాదము ముంచుకొని వచ్చిన నెట్లు జరిగిన నట్లు జరుగును.' అని హంస పలుకఁ గూర్మమిట్లు పలికెను.

"ఏదో యొకటి జరుగునని యూరకుండుట తెలివి తక్కువ. అనాగత విధాతయు, ప్రత్యుత్పన్న మతియు సుఖిం పఁగా, యద్భవిష్యుఁడు నశించినాఁడు. మీ కా కథ దెలుపు దును వినుఁడు.

మూఁడు చేఁపల కథ

పూర్వ మొకప్పు డీచెఱువునందే యనాగత విధాత, ప్రత్యుత్పన్నమతి, యద్భవిష్యుడు, నను మూఁడుచేపలు వసిం చుచుండెడివి. 'జాలరులు వచ్చి వేటాడఁదలఁచి' రను సంగతి

విని వానిలో ననాగత విధాత మఱొక జలాశయమునకు వెడలి పోయెను.

ప్రత్యుత్పన్నమతి యిటులు తలచెను. "భవిష్యత్తులో నెపు డేమి జరుగునో యెవరు నిర్ణయింపఁగలరు? ఆపదవచ్చినపుడు సమయానుకూలముగా నుపాయ మాలోచించుకొనవచ్చును. జరుగనున్నది జరుగక మానదు. జరుగఁబోవని దెచట నున్నను జరుగఁజాలదు." యద్భవిష్యుఁ 'డేదో యొకటి జరుగు' నని యెక్కువగా నాలోచింపక యూరకుండెను.

మరునాఁ డుదయమున జాలరులు వచ్చి పట్టుకొనఁగాఁ బ్రత్యుత్పన్నమతివలలో మరణించినట్లు నటించెను. వారది పనికి రాదని యెంచి వలనుండి తీసిదూరముగా విసరివైచిరి. అచట నుండి యది యెట్లో తప్పించుకొని లోఁతునీట మునిఁగెను. యద్భవిష్యుఁడు మాత్రము పల్లెవాండ్రకుఁ జిక్కి తప్పించుకొను నుపాయము గానక మృతి నొందెను. కావున నేను నీమఱొక చెఱువునకుఁ బోవ సాయముఁ జేయుఁడు. నావుడు నాయంచ లిటు లనియె.

"మఱొక చెఱువుఁ జేరినపిదప నీకుఁ దప్పక కుశలమే. కాని నీ వచటి కపాయకరమైన మెట్టత్రోవ నెట్లు పోఁగలవు?" "మీతోన నాకాశమార్గమునఁ దీసికొని పొం" డని కూర్మ మన "నదియెట్లు సాధ్య" మని యవి సందేహించెను.

"మీ రొక కఱ్ఱను రెండు చివరల ముక్కులతో బట్టు కొనుఁడు. నేను దాని నడుమఁ గఱచుకొనియుండ మీ రెక్కల బలమున నాకసమున నెగిరిపోవచ్చు" నని తాబేలన హంస 'లీయుపాయము మంచిదేకాని దీనియం దపాయ మేమైన నున్న దేమో కనుఁగొనవలయును. బుద్ధిమంతుఁ డుపాయము నంటి యుండు నపాయమును గూడ నెఱుఁగకున్నచోఁ దన పిల్లలను ముంగిసల పాలొనరించి దుఃఖమునొందిన కొంగగతి గలుగును. నీ కా కథ చెప్పెదను వినుము.

అపాయసహితమైన యుపాయముచేఁ జెడిన కొంగ కథ .

ఉత్తర దేశమున గృధ్రకూట మను పర్వత మొక్కండు గలదు. ఆకొండయం దొక పెద్దపిప్పలిచెట్టుగలదు. ఆచెట్టుమీఁద లెక్కలేనన్ని కొంగలు కాపురము సేయుచుండెను. ఆచెట్టు మొదట నున్న పుట్టలోనొక సర్పము గలదు. చెట్టెక్కి యది కొంగలు పెట్టిన పిల్లలను తిని జీవించుచుండెను. ఆకొంగల దుఃఖమును భరింపలేక యం దొక పెద్దకొంగ కడమవాని కిట్లు సలహా చెప్పెను. 'మీరు చేఁపలను దీసికొనివచ్చి ముంగిసలు వసించు కలుగులనుండి పాముండు పుట్టవఱకు వానిని బడ వేయుఁడు. ఆ యాహారము రుచిచూచి ముంగిసలు పాము పుట్టవఱకు వచ్చి దానిఁ జూడవలయును. సహజవైరమువలన పాము నవి చంపివేయగలవు.' ఆమాటలు విని కొంగలన్నియుఁ గడు శ్రమకోర్చి యెన్నో చేఁపలదెచ్చి యనుకొన్నట్లు పడవై

చెను. తలఁచినట్లుగనే ముంగిసలు చేఁపలవెంబడి వచ్చి పామును జంపివైచినవి. వానికిఁ జెట్టుమీఁదఁ బక్షిపిల్లల ధ్వనులు వినరాఁగా నవి చెట్టెక్కి పక్షిపిల్లల నన్నిటినిఁగూడఁ దినివైచెను. కావున మే మిట్లంటిమి. మేము నీవన్నట్లు నినుఁ దీసికొనిపోవుచుండఁగాఁ జూచిన ప్రజ లూరకుండక యేమైనఁ బలుకఁగలరు. అదివిని నీవేమైన జవాబీయఁదలఁచి నోరు దెఱచితివేని నీప్రాణములు నీవికావు; కావున నెట్లైన నీవిచటనే యుండుట మేలు. నావుడుఁ గూర్మ మిటులనియెను. "నే నంత యజ్ఞురాలఁగాను. వా రేమన్నను నే నేమియుఁ బలుక కూరకుండఁగలను."

తుదకుఁ దాఁబేటి మాటల కంగీకరించి హంసము లది పట్టుకొన్న కర్రను రెండువైపుల ముక్కునఁ బట్టుకొని వెడలుచుండ; నా విచిత్రమును కొందఱు గోపాలకులు చూచిరి. వారు వానివెంటఁబడి పరువెత్తుచు "నీ తాఁబేలు క్రిందఁబడిన వెంటనే వండికొని తిందము; ఇచటనే కాల్చుకొని తిందము; కాదు ఇంటికిఁ దీసికొనిపోవుదము;" అని వారిలోవారు వాదులాడుకొనుచుండిరి.

ఆ మాటలకుఁ గూర్మమునకుఁ గడుఁగోపము కలిగెను. తనప్రతిజ్ఞనుమఱచి 'మీఁబూడిద తినుఁ'డని పలుకుచుఁ బట్టువదలి క్రిందఁ బడిపోయెను. దానిని వారు చంపి తీసికొనిపోయిరి. కావున హితవాక్యములు విననిచోఁ హాని సంభవింపకమాన"దని మంత్రి పలుకుచుండ గూఢచరుఁడగు బకమువచ్చి "ప్రభూ! నేను ముందే నుడివితిని 'ప్రతిక్షణము దుర్గశోధన మవసర' మని.

మీ రాపలుకుఁ బాటింపరైతిరి. దానిఫల మిపు డనుభవము నకువచ్చెఁగదా! శత్రుమంత్రియగు గృధ్రముప్రేరణచే మేఘ వర్ణుఁడే కోటలో నిప్పు ముట్టించెను.” నావుడు రాజు నిట్టూర్పు విడిచి యిట్లనియెను. “తాత్కాలికమగు నుపకారమువలనఁ గాని, యనురాగము వలనఁగాని శత్రువులను విశ్వసించువాఁడు వృక్షాగ్రమున నిద్రించినవానివలెఁ బతనము సంభవించినపుడు మాత్రమే వివేకము నొందగలఁడు.”

ఆమాటలు విని మరల బక మిటులు చెప్పెను. “దుర్గ మును దహించి యిచటినుండి వెడలిన యనంతరము చిత్రవర్ణుఁ డాతనిపై ననుగ్రహముచే నిట్లనియె. ‘ఈమేఘవర్ణు నీకర్పూర ద్వీపరాజ్యమున కధిపతిగా నభిషిక్తునిఁజేయుదము. కృతకృత్యుఁ డగు సేవకుని యుపకారము మఱువరాదు. మాటచేతను, క్రియచేతను నాతని సంతోషపఱుపవలయును.’ నావుడు ప్రధానమంత్రి గ్రద్ద యిట్లనియె.

“ప్రభూ! ఇది యుచితముగాదు. మఱొక యుపకార మేదైనఁ జేయఁదగును. ఘనులగువారి కుచితమగు పదవిలో నెన్నడు నీచునిఁ గూరుచుండఁ బెట్టరాదు. నీచుఁ డుత్తమ పదవి నొందెనేని ప్రభువునకే హాని దలపెట్టఁ గలఁడు. ఒక మూషికము వ్యాఘ్రముగాఁ జేయఁబడి తన్నుగాపాడిన మునినే చంపయత్నించెను. నీకాకథ యెఱింగింతును, వినుము.

తన్ను వ్యాఘ్రముగాఁ జేసి కాపాడిన మునిని జంప యత్నించిన మూషికము కథ

గౌతమ మహర్షి తపోవనమున మహాతపుఁ డను నొక
ునిగలఁడు. ఒకనాఁ డొక కాకి యెలుకపిల్ల నెత్తుకొనియెగిరి
ోవుచుండ, నది దాని నోటినుండి జాఱి ముని సమీపమునఁ
డెను. దానిం గాంచి యాతఁడు జాలి నొంది నీవారధాన్య
గింజలిడి పెంచుచుండెను.

ఒకనాఁడు మార్జాలమొకటి దానింబట్టు కొనఁబోవ
ె ప్రాఁకివచ్చి మునియొడిలోఁ బడెను. ముని దానిం గరు
ంచి తన మహిమవలన మార్జాలముగా మార్చెను.

మఱొకనాడు పిల్లిగామాఱిన యెలుక నొక కుక్క
ఱముకొని రాఁగా మునిదానిం గుక్కగా మార్చెను. ఇం
కనాఁడు కుక్కగా నున్న యెలుకను బెద్దపులి తఱుమగా
ముని మరల దానిని వ్యాఘ్రముగా మార్చెను. అనంత
ుు ముని దానిని మూషికముగనే భావించుచుండెను. ఆ
ునిని, వ్యాఘ్రమును జూచియందఱు 'నీముని యెలుకను
లిగా మార్చినాఁడట' యని చెప్పుకొను చుండిరి. అదివిని
ిగా మాఱిన యెలుక యిటులు తలపోసెను.

"ఈముని జీవించియున్నంతకాలము నకీర్తికరమగు నా
న వృత్తాంతము మాసిపోదు. మఱియు నీముని యెప్పుడైన
నే క్షుద్రజంతువు మీఁదికైన నేఁగిన దానిని మనతోఁ దుల్య

ముగా మార్పఁగలఁడు. మఱియుఁగోపమువచ్చిన నన్నెట్టి రూపమునకైనఁ మార్పఁగలఁడు. కావున నీముని నిపుడే మట్టుపెట్టుట మంచిది" అని తలఁచి మునిపైఁబడ నుంకింప నతఁడది కనిపెట్టి దాని నెప్పటియట్లు మూషికముగా మార్చి వైచి దానితో నిట్లనెను. "నీచప్రాణి కౌన్నత్యముఁ గల్గించినను నది మేలు గాఁ జాలదు. దానిని యథాస్థితిలో నుంచుటే యుత్తమము. ఈయర్థము నెఱింగించు కథ యొకటి కలదు. నీకది యెఱింగించెదను వినుము.

కన్యగా మారి తగినవరుడు దొరకక యథాస్థితి నొందవలసి వచ్చిన మూషికము కథ

ఒకముని పుణ్యతీర్థములన్నియు సేవించుచు నొకనాఁడు గంగానదియందు స్నానము గావించి సూర్యున కర్ఘ్యమొసఁగుచుండెను. ఆసమయమున నాకాశవీధి యందొక డేగ యెలుక నొకదానిం దన్నుకొని పోవుచుండెను. దైవ వశమున నా యెలుక డేగపట్టునుండి జాఱి యర్ఘ్యమొసఁగు చున్న యాముని చేతులలోఁ బడెను. అతఁడు దానింజూచి వేడుకగలవాఁడై దయదలఁచి 'ఈమూషికము కన్యయగుఁ గాక' యని పలుకఁగా నది యట్లే యయ్యెను.

ముని యకన్యను గొనిపోయి తనభార్య కిచ్చెను. ఆమె కన్న కొమారితకన్న నెక్కువప్రీతితో నాకన్యకను బెం

పఁగాఁ 'గొంతకాలమున కామెకు యౌవనము వచ్చెను. మిక్కిలి సుందరముగా నున్నయామెను గనుఁగొని యమ్ముని యొకనాఁ డిట్లు చింతించెను.

" ఈకన్యను దగిన వరునకు సమర్పింప వలయును. లేకున్న వివాహ వయసు దాఁటిపోవును. అందువలనఁ బాపము కలుగుటే కాక ప్రజలందఱు నిందింతురు. చక్కని చుక్క యగు నీమెను సామాన్య వరున కీయరాదు."

ఇట్లాలోచించి మంత్రములచే సూర్యుని స్మరించెను. వెంటనే దివ్యమూర్తియైన భాస్కరుఁడు ప్రత్యక్షము కాఁగా నమస్కరించి యమ్ముని యిట్లనెను.

" ఈసుందరికి మానవుఁడు భర్త కారాదని నిన్ను స్మరించితిని. నీవీమెను భార్యగా గ్రహింపుము" అని కోరెను.

" ఈ సుందరిని వరించుటకు మహాబలిష్ఠుఁడైన వాయు వొక్కఁడే యర్హుఁడు. ఆతఁడు నాకన్న సంపదలుగలవాఁడు." అని చెప్పి సూర్యుఁడు వెడలిపోయెను.

అప్పు డాముని తన తపశ్శక్తిచే వాయుదేవుని స్మరించెను. ఆతఁడు వెంటనే ప్రత్యక్షమయ్యెను. " నాకుమారియగు నీకోమలిని వివాహమాడు" మని ముని యామెం జూపఁగా వాయుదేవుఁడు మెల్లన నిట్లు పలికెను.

" దేవేంద్రుఁడు నాకంటె గొప్పవాఁడు. ఆతనిఁ గాదని యితరుల కిచ్చుట న్యాయము గాదు. ఆతని కిచ్చి పెండ్లి చేసిన

యెడల నీవు సకల స్వర్గసౌఖ్యములు ననుభవించుము.” అని మునికి నచ్చఁ జెప్పి వాయు దేవుఁడు వెడలిపోయెను.

ఆముని యపుడు మంత్రమహిమవలన నింద్రు నారాధింపఁగా నాతఁడు ప్రత్యక్షమయ్యెను. ఆముని యానందించి దేవేంద్రునిం బెక్కువిధముల స్తోత్రము చేసి “చూడు మీ సుందరాంగి నాతనయ. దీనిని వివాహమాడుటకు నీవే యర్హుఁడవు. నరసురాసుర కిన్నర యక్షవరులలో నింకెవ్వరు దీనికిఁ దగరు. కావున దీనిఁ జేకొనుము.” అని ప్రార్థించెను.

అంతట దేవేంద్రుఁ డామునీంద్రున కకన్నియమీఁదఁ గల వాత్సల్యమును, నాకన్య జనించిన విధమును గ్రహించి నవ్వుచు నిట్లనెను.

“మేరుపర్వత శ్రేష్ఠుఁడు మాకును మాకును నందఱికినిఁ బూజనీయుఁడు. సురుచిరములయిన రత్నసానువులతో నొప్పుచుండును. ఆతనిశృంగములు మహోన్నతములు. సూర్యచంద్ర నక్షత్రాదు లనవరతము నాతని చుట్టుఁ దిరుగుచుందురు. శంకరుఁడు, బ్రహ్మ మున్నగు దేవత లాతని శిరమున నుందురు. ఆతఁడు ధనికుఁడు. సత్యవంతుఁడు. కావున నీపుత్రిక నాతని కిచ్చుట మేలు” ఇట్లు చెప్పి యింద్రుఁ డంతర్ధానమయ్యెను.

“పిలిచి పిల్ల నిచ్చెదనన్న నొకరు నంగీకరింపరైరి. వారితోడనే యున్నదా యేమి?” అని తలఁచి యాముని మేరువును స్మరించెను. వెంటనే యాతఁడు సుకుమారరూపముఁ

దాల్చి మునికిఁ బ్రత్యక్షము కాఁగా ముని యాతని కర్ఘ్యసత్కారములొనరించి "ఈసుందరి నెవ్వరికి నీయక నీకీయదలఁచితిని. కావున మాతో వియ్యమందవలయును" అని పలికెను.

దానికి మేరు విట్లు బదులు పలికెను. "నాశరీరము మిక్కిలి స్థూలమైనది. అంతగొప్పశరీరమును వేషధారిణియగు నీమూషికము పెక్కుకలుగులుగాఁ దొలిచి వైచును. కావున నిది నాకన్న నధికురాలు. కావున నీ కుమారిక కిట్టి ఘనమైన మఱియొక్క మూషికమే భర్తకాఁ దగును. కాని నావంటి యల్పుల కీమె నిచ్చుట మంచిదికాదు" అని పలికి యమ్మునిని వీడుకొని మేరువు వెడలిపోయెను.

అపు డాముని యాకన్య కెచటను దగిన వరుఁడు లభింప నందున "దీనికి వివాహవయసుదాఁటి పోయిన ధర్మహాని గలుగును. పూర్వమువలె మూషికమైయున్న నేవిచారము నుండ" దని తలపోసి మరల మూషికముగా మార్చివైచెను. కావున నీచు నున్నతాధికారమున కెన్ను కొనరాదు. నీచుని నధికారిగా నంచుకొని శశకపింజలములు వినాశము నొందెను. నీకాకథయు నెఱింగించెదను, వినుము.

నీచు నధికారిగా వరించి చెడిన శశకపింజలముల కథ

ఒకానొక చెట్టుతొఱ్ఱయందుఁ గపింజలమను నొకపక్షి నివసించుచుండెను. అదియొకనాఁ డాహారమునకై పోయి

కొంచె మాలస్యముగాఁ దనతావునకుఁ దిరిగివచ్చెను. అప్పటికి దాని నివాసస్థలమున దీర్ఘకర్ణమను పేరుగల కుందేలు ప్రవేశించి యాక్రమించి యుండెను. దానింజూచి కపింజలము "మేఁతకుఁ బోయి వచ్చునంతలో నాయిల్లాక్రమించుట తగునా" యని యడిగెను.

"విడిచిపోయిన యింటికి, నరపతిలేని రాజ్యమునకు, మగదిక్కులేని సతికి నెవఁడు బలవంతుఁడో వాఁడే యధికారి కాఁగలఁడు. నేను బలవంతుఁడను దీనిని నేను విడువ వలసిన యవసరము లేదు.

మఱియుఁ జెఱువులుఁ, గూపములు నెవరివశముననున్న వారివే యని మనువు పలికెను. కావున నే నిచ్చోటు వదలను." అని కుందేలు పలికిన మాటలకుఁ గపింజల మిట్లనెను.

"మొగమోట యించుకైన లేక యిది నాయిల్లని పలుకుట నీకుఁ దగదు. తగవు దీర్చుకొందము రమ్ము. లేదేని నీకును నాకును బెద్ద జగడము తప్పదు."

దాని కంగీకరించి యాశశము "తగవు దీర్చుకొనుటకు రమ్మనఁగా రాననుట పాడిగాదు" అని పలికి యాపక్షితోఁ గూడి కొంతదూరము పోయి "మనకుఁ దగవు చెప్పు వారెవ్వరు?" అని కపింజల మడుగఁగా యమునా నదీతీరమున దధికర్ణుఁ డను మార్జాలశ్రేష్ఠుఁడు కలఁడు. ఆతఁడు సత్యవ్రతుఁడు. ఆతని నడిగి ధర్మసందేహముఁ దీర్చుకొంద" మనెను.

"పిల్లి హృదయము కడుఁ గ్రూరమయినది. ఎన్నఁడు దానిని నమ్మరాదు. నీకట్టి మార్జాలము మీఁద విశ్వాస మెట్లు కలిగె" నని పక్షి ప్రశ్నించెను.

"దధికర్ణుఁ డాచారవంతుఁడు. ఉత్తముఁడు. ఈచేరువ వారందఱు నాతని నెఱుంగుదురు. నీకేమియు భయ మవసరము లేదు నాతోరమ్ము" అని చెవులపిల్లి బదులుపల్కెను.

"నాకు భయమున్న నీకును భయ ముండును. యిది యిర్వురకు సమానమే. నాకుఁదోఁచినమాట చెప్పితిని. నీకు లేని భయము నాకు మాత్రమేల ?" యని కపింజల మనెను.

అట్లాశశకపింజలములు పోయి పోయి దధికర్ణుని నివాసమునకుఁ జేరి కొంతదూరమున నిలిచి "మాయిరువురకు నింటి విషయమై వివాదము గలిగినది. నీవు ధర్మమార్గమున దీనిని బరిష్కరించి వేగముగా మమ్ముఁబంపి వేయు" మని కోరెను.

ఆమాటలు విని మెల్లనఁ దలయెత్తి చూచి దధికర్ణుఁ డిట్లనెను. "వెనుకటివలెఁ గాక మిక్కిలి ముదుసలినై యుంటిని. దూరముననున్న వస్తువులు కంటికానుటలేదు. మాటయు బాగుగా వినఁబడుటలేదు. ఈవిధమున నింద్రియ వైకల్యము నొందియుంటిని. నాపై విశ్వాసమున్నచో దగ్గఱికి వచ్చి మీరు చెప్పఁదలఁచినది చెప్పుఁడు." దధికర్ణుని యీమాటలు విని యది సమీపించుట కింకను గొంచెము వెఱచు చుండఁగా మరల నతఁ డిట్లనియె.

" పనిగట్టుకొని బంధువులై యిచటికివచ్చి భయపడ దరేల ? ధర్మమును మనము చెఱిచిన నది మనలను నాశము చేయును. ధర్మమును మనము కాపాడిన నది మనలను రక్షించును. ధర్మమే మిత్రుఁడై వెనువెంట వచ్చును. తక్కినధనము లన్నియుఁ గర్మాయత్తమైన శరీర మెచట నశించునో యచటనే నిలిచిపోవును.

నాపలుకు లన్నియు నిజములు. కల్లలాడువాఁడు నరక కూపమునఁ బడిపోవును. కావున నీచవృత్తితోఁ గల్లలాడువాఁ డనుగాను.

అహింసకు మించిన ధర్మములేదు. పరమాత్మ స్మరణము తప్ప నితరములన్నియు విడిచి యహింసావ్రతముం బూని చాంద్రాయణ వ్రత మనుష్ఠించుచున్నాను. నాతపశ్శక్తి వలన మీరడిగిన ధర్మసందేహము లన్నియుఁ దీర్పఁగలను. "

ఈవిధమున నమ్మకము గలుగునట్లుగా దధికర్ణుఁ డొసఁగిన దీర్ఘోపన్యాసము విని శశకపింజలములు భయ ముడిగి దగ్గఱకిఁ జేరి నిలిచెను. వెంటనే యా రెండింటిని ముందఱి కాళ్ళతో బట్టి చంపి దధికర్ణుఁడు ప్రీతిమీఱ భక్షించెను." కావున నీచుని నధికారిగా నొనరించికొన్న శశకపింజలములవలె చేటొందక తప్పదు.

మఱియు నీకర్పూర ద్వీపమును వశపఱచికొని యేలుటంత తేలికపని యనిఁ తలఁచి పేరాసనొందరాదు. [illegible]ము లైన చేపలఁ బెక్కింటినిఁ బొట్టఁబెట్టుకొని పేరాసచేత నొక

కొంగ తుద కెంద్రకాయచే మరణము నొందెను. నీకాకథ యెఱింగించెదను వినుము.

పేరాస వలన నెంద్రకాయచే మృతినొందిన కొంగ కథ

మాళవ దేశమునఁ బద్మగర్భమను నొక సరస్సు గలదు. అచట బలహీనమై, దీనమైన దానివలె నున్న యొక ముదుసలికొంగను జూచి యొక కుళీరమిట్లు ప్రశ్నించెను. 'నీవెందువలన నాహారము ముట్టక యిటు లుంటివి?' నావుడు బక మిటులనియె. "మత్స్యములు నాజీవనమున కాధారములు. వానిని జాలరులువచ్చి పట్టివేయుదురని నగరపరిసరముల విని యుంటిని. జీవనవృత్తి నశించి మరణ మవశ్యము సంభవించు నసికలతనొంది యాహారము నందు ప్రీతిలేనివాఁడనై యుంటిని."

మత్స్యము లాపలుకులు విని యిటు లాలోచించినవి. 'ఈసమయమున నీకొంగ యుపకరించు నటులు గానఁబడు చున్నది. కావున గర్తవ్యమేమో దీనినే యడుగుదము. ఉపకరించు వైరితోనైన సంధి చేసికొనవలయును. మిత్రుఁడైన నపకరించువానిఁ జేరరాదు. మిత్రత్వ శత్రుత్వములకులక్షణము, లుపకారాపకారములే కదా!' యని తలఁచి యవి కొంగను జేరి 'యోబకోత్తమా! ఇఁక మేము బ్రదుకు నుపాయ మేదైనఁగలదా?' యన నాకొంగ మఱొక చెఱువును జేరుట యొక్కటే మీకు రక్షణోపాయ' మనెను. నీవే మాపైఁ

గరుణించి మఱొక కొలనికిఁ జేర్పుమని యాచకమును చేఁపలు వేడుకొనఁగా నయ్యది యొకొక్క చేపం దీసికొనిపోయి భక్షించుచుండెను.

అన్నియు నైనపిమ్మటఁ గుళీరము దన్నుఁగూడ జలాశయాంతరమునకుఁ దీసికొనిపొమ్మని బకమును గోరెను. అపూర్వమైన యెండ్రకాయ మాంసము లభించుచున్నదని పేరాసఁ జెంది యానందముతోనా కొంగ దాని దీసికొని యొకస్థలమునఁ బెట్టి పొడుచుకొని తినుట కువ్విళ్ళూరుచుఁ బోవుచుండ నా కుళీర మచటి చేపల యెముకలన్నింటినిజూచి 'అయ్యో చచ్చితిని. ఇపుడు సమయోచితముగా మెలఁగి దీనిఁ దప్పించుకొనవలయు' నని యాలోచించెను.

"భయపరిస్థితి వచ్చువఱకు భయపడఁదగును. వచ్చిన పిమ్మట భయము వీడి తెగువఁ జూపవలయును. శత్రువు నెదుటఁబడి మఱొకసాధన మేమియుఁ గానరానపుడుయుద్ధము చేసి మరణించుట ప్రాజ్ఞుని లక్షణము 'యుద్ధము చేయకున్న మరణము తప్పక సంభవించు పక్షమున, యుద్ధము చేయుచో రవంతయైన గెలుపునం దాసయున్నపుడు దప్పక యుద్ధము చేయఁదగు' నని పండితులు పలుకుదురు." అని యాలోచించి యాకుళీరము తనశక్తి యంతయు నుపయోగించి కొంగమెడను బట్టి దానిని ఛేదించెను.

అని మంత్రి చెప్పఁగా విని చిత్రవర్ణుఁడు "సచివోత్తమా! ఇచట నీకర్పూర ద్వీపమున రాజుగాసుండి, యిచటి యమాత్య

వస్తువులన్నియు మేఘవర్ణుఁడు నాకంపగలఁడనియు, వానిని సుఖముగా ననుభవింప వచ్చుననియు భావించితి ” నని పలుక మంత్రి నవ్వి యిటులనియె. ‘రాబోవుసుఖములను దలఁచుకొని సంతసించు వాఁ డవి కలుగ నపుడు మిక్కిలి యాశాభంగము నొందును.’

రా జా మాటవిని రహస్యముగా గ్రద్దతో ‘నట్లైన నిపుడు నన్నేమిచేయమందు’ వని యడిగిన మంత్రి యిటులనియె. ‘మదోద్ధతుఁ డగు రాజును, జెల రేఁగిన యేనుఁగును నడుపువారు జననిందకుఁ బాత్రులగుదురు. ప్రభూ ! వినుము మన బలాధిక్యత వలన దుర్గము గెలువఁబడినదా ? లేక యుపాయబలమున గెలువ బడినదా? ” యని ప్రశ్నింప రాజు “ ఆర్యా ! పూజ్యులగు తమ యుపాయముననే గెలువఁబడిన” దనియెను.

అటులైన నామాటయందు గౌరవముంచి వెంటనే స్వదేశమున కేఁగుటమేలు. అట్లుకాదేని వర్షాకాలము రాఁగానే మరలఁ దప్పక యుద్ధముజరుగును. పరభూమియందున్న మన కపుడు స్వదేశమున కేఁగుటకైన వీలుచిక్కదు. శాంతి సుఖముల నాసించినచో సంధిచేసికొని వెడలుట యుత్తమము. దుర్గము జయించి కీర్తి సంపాదించితిమి. సంపాదించిన విజయ మపజయముగా మారకుండ మనము చూచుకొననియెడల లబ్ధనాశము నొంది దుఃఖపడిన మొసలివలె నగుదుము. నీకాకథ యెఱిఁగించెదను వినుము.

తన యవివేకముచే లబ్ధనాశనమొందిన మొసలి గాథ

లవణసముద్రతీరమున మహావృక్షములతో నిండిన యొక తోఁటలో బలివర్ధనుఁడను నొక కపివరుఁడు వేలకొలఁది తన యనుచరులతో నివసించుచుండెను. కొంతకాలమునకుఁ బిమ్మట సమీపమందలి మఱొక కోఁతుల మందకు నాయకుఁడైన కపీశ్వరుఁడు ముదుసలియగు బలివర్ధనుం బాఱఁద్రోలి యాతని రాజ్య మాక్రమించెను.

బలివర్ధనుఁడు చేయునదిలేక సిగ్గువడి యచటనుండి చాల దూరము వెడలిపోయి యొక నదిగట్టునఁ బండ్లతో నిండిన యొక పెద్ద మేడిచెట్టును గనుఁగొనెను. తన యదృష్టము వలన ఫలభరితమైన యా వృక్షము కనఁబడినదని సంతసించి యా చెట్టుపై వసించుచు నందలి పండ్లారగించుచుఁ గాలముఁ బుచ్చుచుండెను.

అట్లా మర్కటము పరిపక్వములైన మేడిపండ్లుగోసి కొని భక్షించుచుండ నొకపండు చేయిజారి నీటిలోఁబడి చప్పుడయ్యెను. అదేసమయమునఁ గ్రకచుడను పేరుగల మొసలి యొకటి సమీపమున జలములందు సంచరించుచు నా ధ్వని విని "ఈ ప్రాంతమున నెప్పుడు నిట్టిధ్వని విని యుండలేదు." అని తలయెత్తి చూచెను. గట్టుమీఁది యుదుంబరవృక్షశాఖాగ్రమున విలాసముగాఁ గూరుచుండి పండ్లు కోసి తినుచున్న మర్కటముం జూచి, యది జారవిడిచిన ఫలమే ధ్వనికిఁ గారణ

మని తెలిసికొనెను. వెంటనే "ఓ మర్కట శ్రేష్ఠుఁడా! నీవు మహోన్నతస్థానము నధిష్ఠించి మహాఫలము లనుభవించు చుంటివి. క్రిందనున్న మావంటి మిత్రులకుఁ గూడ ఫలప్రదానముఁ గావింపరాదా?" యని యడిగెను. బంధుమిత్రవర్గము నెడఁబాసియున్న వానరమున కా మాట లమృతప్రాయముగాఁ దోఁచెను. వెంటనే క్రకచుని చెలిమి కోడంబడి మధురము లైన కొన్ని ఫలములుగోసి యాతనికిఁ గ్రిందఁ బడవైచెను. క్రకచుఁడును వాని మాధుర్యమునకుఁ బరవశుఁడై కొన్నిరోజు లింటికిఁ బోక కపివరునితో మైత్రి నెఱపుచు నచటనే యుండెను.

ఆ మొసలి భార్య యెంతకాలమునకు నింటికి రాక యున్న పెనిమిటిని దలంచుకొని మిక్కిలి విచారించి, తన చెలికత్తెను బిలిచి యిట్లనెను.

"ఇంతకుముందు నా ప్రియుఁ డెచ్చటి కేఁగినను వెంటనే తిరిగివచ్చుచుండువాఁడు. ఈ సారి వెడలి యిన్ని దినము లయినను నింటికిఁ జేరకుండుటకుఁ గారణమేమియుఁ గానరాదు. ఎచటనైనఁ జిక్కులఁబడెనో? పరాంగనలం దాసక్తుఁడై యెచటనైన నిలిచిపోయెనో? యెఱుఁగరాదు. కావున నీవేఁగి యెట్టైన సమాచారముం దెలిసికొని రమ్ము."

చెలికత్తెయు మర్కటమకరముల చెలిమిఁ గనుఁగొని యాడుమొసలి కడకు మరలిపోయి యున్నవియు లేనివియుఁ గల్పించి యిట్లు చెప్పెను.

"చెలీ! నీ పనుపున నెవ్వరెఱుంగకుండఁ బోయి నీ పతి జాడ గనుఁగొని వచ్చితిని. ఈ నది యొడ్డున నొకయుదుంబర వృక్షము మీఁద రూపలావణ్య విలాసములతో నొప్పు నొక కపిభామ గలదు. నీప్రియుఁ డామె పొందునొంది మక్కువతో నక్కడి నుండి కదలి రాఁజాలకుండెను. నీమీఁది భక్తిచే సత్యము చెప్పవలసి వచ్చినది."

చెలికత్తె చెప్పినమాటలు విని యాఁడు మొసలి మిక్కిలి పరితాప మొందుచుండునంతలోఁ గ్రకచుఁడు పెండ్లాము మీఁది మక్కువచేఁ గపివరునడిగి యుదుంబరఫలములు గొన్ని దీసి కొని యింటి కేతెంచెను. మిక్కిలి వంతనొందియున్న ప్రియు రాలింగాంచి "కోమలీ! నీ తీరు చూచిన మిక్కిలి భయమగు చున్నది. నీవిట్లు పరితాపము నొందుచుండుట గారణమేమి? నీ మనసులోని బాధయేమో కొంచెము నాకెఱింగించితి వేని నీకొర్కెయెట్టిదైనఁ దీర్చెద" నని పలికెను. ఆఁడుమొసలి యేమియుఁ బలుకఁజాలక చెలికత్తెవంకఁజూడ నది నిజమేయని తోఁచున ట్లీ విధమునఁ బలికెను.

"నీవు వెడలినది మొద లీమె రోగమునకుఁ జిక్కినది. ఇఁక గొన్నినాళ్ళిటులున్న నీమె జీవించుటకల్ల. ఒకసిద్ధుఁడీమె జీవించుట కొక మందుచెప్పి వెడలినాఁడు. నాఁటినుండియు నీసంగతి నీకుఁ దెలుపుదమన్న నీజాడయే కానరాదయ్యెను."

ఆ మాటలువిని కనులనీరు వెట్టుకొని క్రకచుఁ డిట్లనియె. "సంజీవని మొదలుగా నెట్టి వస్తువైన నవలీలగాఁ దెచ్చి

యీామెను బ్రదికింపఁగలను. ఇది వట్టిమాటగాదు. వెంటనే చెప్పు మాయౌషధ మెద్ది?

ఆ మాటలకు 'వానరహృదయముఁ దిన్నచో నీమె రోగము వెంటనే మానును. లేకున్నఁ గొలఁది కాలములో మరణము తప్పదు' అనిచెప్పి వెడలినాఁడు సిద్ధుఁడు. ఈమె నెట్లు బ్రదికించుకొందువో నీసామర్థ్యములో నున్నది. యని చెలికత్తె తెలిపెను.

అదివిని యా మొసలి సరే! యని పలికి కొంతదూరము వెడలి తనమనమున నిట్లు చింతించెను. "కపి హృదయము నాకు దొరకుటెట్లు? కపీశ్వరుఁడైన బలివర్ధనుఁడు పుణ్యాత్ముఁడు, నా ప్రమిత్రుఁడును. అట్టివానిని వధించుట పాడియా? ఎంత విషమ పరిస్థితి సంభవించినది? ఒక వంకఁ బ్రాణమిత్రుఁడు. వేఱొకవంకఁ బ్రియసతి. ఇద్దఱుఁ బ్రాణముకన్న బ్రియమైన వారు. అయినను 'భార్యను రక్షించుకొనుట పరమధర్మ' మని పెద్దలు చెప్పుదురు.

ఉన్నతకులమున జన్మించి, చక్కఁదనమున నతిశయించి, సుగుణముల మేటియై యేమృగలోచన పతి మనసును భక్తిచే వశపఱచుకొనునో యట్టి సతికిఁ బతియై యుండుటకన్న ధన్యత యేమి యుండును? కావునఁ గులకాంతను రక్షించుకొనుటకై బలివర్ధనునిఁ ద్యజించివైచెదను."

ఇట్లు నిశ్చయించి తడఁబడుచు మంద మందముగ నా యుదుంబరవృక్షముం జేరం జనుదెంచిన క్రకచునిం జూచి బలివర్ధనుఁడు " సఖుఁడా ! ఇన్నాళ్ళుండి యింటికి వెడలి వెంటనే మరలివచ్చితివి. దీనికిఁ గారణమేమి ? నీముఖముఁ జూడ విచారముతో నున్నట్లు కానవచ్చు చున్నది. ఇంటియొద్ద నందఱుఁ గుశలమే కద ? " యని ప్రశ్నించెను.

" చాలకాలము నీ చెలిమి కలవడి యుండు కారణమున నింటికిఁ బోగా నాయి ల్లెరవై కానఁబడెను. ఉపకారమును గోరి మైత్రి చేయుదురు. నీవట్లు ప్రత్యుపకార మపేక్షింపక నాతోఁ జెలిమిచేసితివి. అట్టి నీవంటి యుత్తముని విడిచి యుండుట యెట్లు ? " అని మకరము జవాబీయఁగా మరల బలివర్ధను డిట్లనెను.

"నీకు నేను గావించిన మహోపకార మేమిగలదు? నీతోడి స్నేహము వలన నాకు రాజ్యము పోయిన దుఃఖము దొలఁగినది. నీమైత్రివలన సంతోషముగాఁ గాలము గడుపు చుంటిని. శోకమును, శత్రుభయమును పోఁగొట్టి ప్రీతి విశ్వాసములకుఁ గారణమైన "మిత్ర" అను నక్షరద్వయమనెడి రత్నము నే దేవుఁడు సృజించినాఁడోకదా !"

ఆమాటలు విని క్రకచుఁడు "సఖుఁడా ! ఆకాశము వరకుఁ బెరిగిన యీచెట్టు మీఁద నీవును, నీటియడుగున నేనును నున్నంతవరకు మన మైత్రికి సంపూర్ణఫలమెట్లు చేకూరును?

ఇంతేకాక నీవొసఁగిన ఫలములు గొనిపోయి నాప్రేయసి కిచ్చి నీవృత్తాంతముఁ దెలిపితిని. ' ఇన్నాళ్ళు ప్రాణమిత్రుఁడొసఁగిన మధుర ఫలములు తెగఁ దిని, యాతని మన యింటి కతిథిగాఁ గొనిరాకుండ నెట్లు రాఁగలిగితిరి? మీకీ మాత్ర మాలోచనయే యేల తోఁచకపోవలయును?' అని నాభార్య నను మందలించినది. కావున నిన్నుఁ దీసికొని పోవలయునను తలంపున వచ్చితిని" అని పలికెను.

'తరుచరమ నగు నేను నీతో జలములలోని కెట్లు రాఁగల' నని బలివర్ధనుఁడు ప్రశ్నింపఁగా "నీకాభయమక్కఱ లేదు. నామూపుపై నిన్నుఁ దీసికొనిఁ పోఁగలను. మా యింటి సమీపమున నిసుకతిన్నెయందు మన ముల్లాసముగా విహరింప వచ్చును. అచటను ఫలవృక్షములుగలవు." అని క్రకచుఁడు బదులు పలికెను.

వానరవరునికి మకరపత్నిని జూడవలయునని వేడుక కలిగెను. వెంటనే నిష్కపట బుద్ధితో మొసలి వీపు మీఁదికి వచ్చి కూరుచుండెను. అట్లు బలివర్ధనునిఁ గొని పోవుచు నూరకుండఁ జాలక మకరమిట్లు తలపోసెను. 'నేటికీ మిత్రునిఁ జంప వలసి వచ్చెనుగదా! నావంటి పాపాత్ముఁ డుండఁడు. స్త్రీ కారణమునఁ జెలికానిం జంపుచున్న నాకు లోకమున నెట్టినింద కలుగునో కదా!

బంగారము మంచి చెడ్డలు క్షణములో నొరపుడు రాతిపై గీచి తెలిసికొనవచ్చును. కొంచెము పరిశీలించి

చూచినచోఁ బురుషుని గుణము లిట్టివని గుర్తింపవచ్చును. ఎంత పరిశీలించినను స్త్రీస్వభావముఁ దెలియుట కష్టము. ఒక వేళ నాప్రియురాలే దైనఁ గారణమున నీయుక్తి పన్నె నేమో తెలియదు, ఇట్లాలోచించుచుఁ బరధ్యానమున 'నాడుదాని కొఱకుఁ బ్రియమిత్రునిఁ జంప నాకెట్లు బుద్ధి పుట్టెను' అని కొంచెము గట్టిగాఁ బలికెను.

ఆమాటలు విని బలివర్ధనుడు 'ఇప్పుడేమని పలికితివి? నీమనసులోని చింతయేమో నాకెఱిఁగింపుము' అనఁగా మొసలి 'నే నేమియు ననలేదే! నీవు పొరపడియుందువు.' అని బదులు వలుకగాఁ బలివర్ధనునకు మిక్కిలి సంశయము గలిగెను. 'దీని కేదియో కారణముండి తీరును. అడిగి చూచెదనుగాక.' యని తలచి "నాకుఁ దోబుట్టువగు నీభార్యయిపుడు కుశల ముగ నున్నదా?" యని యడుగఁ గ్రకచుఁడు పరవశత్వమున "నాభార్య జబ్బుపడినది. వైద్యులు రోగ మసాధ్యమని చెప్పిరి. ఏదోయొక మందు చెప్పినఁ దెచ్చువారు లేరు. నీటిలోనున్న వారిపని యింతియేకదా!" యని పలికెను.

ఆమాటలు విని బలివర్ధనుఁడు "జలములందేకాని బయల సంచరింపఁజాలనను విచారము నీకేల? ఆమందేదియో నాకుఁ దెలుపుము. అది యెచటనున్నను భూవలయమంతయుఁ దిరిగియైన సూర్యుఁ డస్తమించులోపలఁ దెచ్చి యీఁగలను." అని పలుకఁగా మకర మిట్లనియె.

"ఒక వైద్యు నడిగితిని. ఆతఁడు చెప్పిన మందు నీకుఁ దెలుపఁజాలకయే నేను బరితాపబడుచుంటిని. ఇపుడు నీవు గట్టిగాఁ బ్రశ్నించుచుంటివి గావునఁ జెప్పకతప్పదు. నామనసులోని దుఃఖము తొలఁగుట నీవశముననే యున్నది."

ఆ మాటలు విని వానరనాథుఁడు "మనసు గలిసిన వారి కేమాటయైనఁ జెప్పక దాచుట పాపమని చెప్పుదురు. ప్రాణసఖుఁడ నగు నాకడ దాపఱికము నీకుఁ దగదు. ఎంత చెప్పఁగూడని మాటయైనఁ జెప్పుము." నావుడుఁ గొంతవిచారముఁ దక్కి యామొసలి యిటులు పలికెను.

"వానరోత్తమా! 'కోఁతి గుండెతోఁ గూడిన యౌషధమీ మగువ కిచ్చినచో నీమె జీవించును. రోగమంతయు హరించును.' అని వైద్యుఁడు నాసతికిఁ జెప్పెను. ఆమె నన్ను వానరహృదయముఁ గొనిరమ్మని కోరెను. ఈ సంగతి యెవ్వరికిఁ దెలుపక నీకుఁ జెప్పలేక యుంటిని. భార్యకు రోగము వచ్చిన వైద్యము చేయింపలేని యసమర్థుఁడని జనులందఱు నిందింతురని యాపనికిఁ బూనుకొంటిని."

క్రకచుని మాటలు విని బలివర్ధనుఁడు భయమునఁ గొయ్యవాఱిపోయి, కొంతసేపటికిఁ దేఱుకొని తనలో నిట్లాలోచించెను. "ప్రేమ నటించి యింటికిఁ బిలువఁగా నీమొసలి మాటలకుఁ జిక్కి మోసపోయితిని. ముదిమివచ్చినను జితేంద్రియుఁడను గాక మకరసతింజూచు కుతూహలము నొందుట

వలన నిట్టి యాపదకు లోనయితిని. రాగద్వేషములు విడువని వాఁ డరణ్యమున నున్నను బ్రయోజనములేదు.” ఇట్లాలోచించి దైవవశమున నొక్క యుపాయము స్ఫురింపఁగా గ్రకచునితో నిట్లనెను.

“ఓయీ, సఖుఁడా! ఎంత పొరపాటు చేసితివి? నాకీ సంగతి ముందేల చెప్పవు? అట్లు చెప్పిన నామందు దీసికొనియే వచ్చువాఁడను గదా!

గుండె బరువని మునలితనమున మోవఁజాలక యొక కొమ్మమీఁదఁ బెట్టి సంచరించుచుంటిని. నేను దురదృష్టవంతుఁడను. మిత్రునకుఁ బ్రాణావసరమైన పదార్థము దగ్గఅనుండియు సమయమున కుపయోగింపని నాజీవితము వ్యర్థము.

అయిన నిది యాలోచనకు సమయముగాదు. త్వరితముగా మేడిచెట్టు కడకుఁ గొనిపొమ్ము. అస్మదీయ హృదయముంగొని యతిశీఘ్రముగా మరలివచ్చి యామె మరణింపకుండఁ గాపాడవలయును.”

ఆమాటలన్నియు నమ్మి యామకరము వానరముఁ దీసికొని క్షణములో నుదుంబరవృక్షముఁ జేరెను. వెంటనే కోఁతి కుప్పించి చెట్టుకొమ్మమీఁది కెగసి చిట్టచివరికొమ్మఁ జేరెను. ‘చెలికాఁడా! రమ్ము. శీఘ్రముగఁ బోయి ప్రియసతిం గాపాడవలయును’ అని క్రకచుఁడు పిలువఁగా బలివర్ధనుఁడు వికటముగ నవ్వి యిటు లనెను.

"చాలుఁ జాలు. నీతోఁ జెలిమిచేసి చాల మేలొందితిని. కోఁతి గుండె యెచట నుండునో తెలియని మూర్ఖుఁడవు పెండ్లాము పన్నుగడ లెట్లు తెలిసికొనఁగలవు? అది యెట్టి రోగమో గ్రహింపఁగల బుద్ధి నీకులేదు. ఒకమాఱు వంచింపఁ బడియుమరల నీకడకు వచ్చు మూఢుఁడనుగాను. తొల్లి యొక నక్క మాటలు విని బుద్ధిలేని గాడిద యొకటి రెండు మాఱులు వంచింపఁబడి వినాశము నొందెను. నీ కాకథ తెలుపుదును, వినుము.

రెండుమాఱులు వంచింపఁబడి మరణించిన గాడిద కథ

ఒక భయంకరమయిన యడవిలో నొకసింహము రాజయియుండెను. ఆతనికడ నొక జంబుకము ప్రియభృత్యుఁడై యుండెను. ఒకనాఁడాసింహముం జంబుకము సూచి "ఓయీ! నాదేహమున మహోదరవ్యాధి యంకురించి, యంతకంతకు ముదురుచున్నది. తగినమందు సేవింపకున్నచోఁ బ్రమాదము సంభవింపఁ గలదు. గార్దభకర్ణ మొక్కటి లభించినచో నది యౌషధమునఁ గూర్చి యారగింతును. దానితో నా వ్యాధి యంతరించిపోవును. కావున నెట్లయిననొక్క గాడిదను నాకడకుఁ గొనిరమ్ము" అని దీనముగాఁ బలికెను.

"చిత్తము" అనిపలికి యాజంబుకము గార్దభమునకై వెదకుచుఁబోయి యొకగ్రామ సమీపమునఁ జిక్కియున్న చాకలి వాని గాడిదను జూచి జాలినటించుచు వినయముతో మాట

లాడి దానికి నమ్మకము పుట్టించి మృగేంద్రముకడకుఁ గొని వచ్చి యెదుటనిలిపెను. ఆసింహము దానింజంపఁబోఁగా నది దాని కందక వేగముగఁ బరుగిడి తనతావునకుఁ బోయి నిలిచెను.

అపుడు సింహము సృగాలముం జూచి "మనయత్నము నెఱవేఱినది గాదు. ఎట్లయిన మరలఁ బ్రయత్నించి కార్యము సాధింపవలయు" నన "మూఢచిత్తుఁడు ముం దెఱుంగక మోసమునకు లోనగునుగాని యొకమాఱు కపటము గనులార జూచియు మరల మోసగింపఁబడుట కష్టము. అయినను నా నేర్పుకొలఁది యత్నించెద" నని పలికి యాగార్దభము కడకుఁ బోయి "ఓయీ! మృగరాజును సేవించి యాతనికడనున్న మేఁత యంతయు సుఖముగా ననుభవింపవచ్చును. సేవకు లందఱుఁ బ్రీతితో మన్నింపఁగలరు. ఈవిధమునఁ బెద్దఱికము వహించియుండజాలక భయపడి పాఱివచ్చుట తగునా? సాహసము లేని వానికి సంపదలు రమ్మన్న వచ్చునా?

ముఱికి బట్టలు మూఁపున మోసిమోసి, చాకలిచేఁ దిట్టులు, మోదులు నొందుచు నిచటనే నడపీనుఁగవై పడియుండుట మేలని తలఁచుచుంటివా?" యని పలికెను.

"ఇరువురమును గలిసిమెలసి బ్రదుకుదము రమ్మని నమ్మించి కొనిపోయి సింహమునెదుట నిడి ననుఁ జంపింపఁ దలఁచుట నీకు న్యాయమా? వాడిగోళ్ళుసాచి, ముఖము మెఱ్ఱవాఱి

భయంకర మగునట్లుగా నామీఁది కుఱుకఁబోవుచుండు సింహము బారిఁదప్పించుకొని పాఱిపోవ కెట్లు నిలువఁ గలను?" అని యాగాఁడిద బదులుపలుకఁగా మరల జంబుకము "నీ విదివఱ కెన్నఁడు సింహముం జూచియుండని కతమున నట్లు భయపడి తివి. సమీపించి నమస్కరించినచో నాతఁడు దయార్ద్రహృద యుఁడై కాపాడును. అది యెఱుఁగక నీవు రాజాశ్రయముఁ బోఁగొట్టుకొంటివి.

స్నేహభావమున నీకు మేలుసేయఁ బోఁగా నా యత్నము ఫలింపదయ్యెను. శ్రేయస్కరమగు యత్నమునకు బహువిధములైన విఘ్నములు కలుగుచుండును. రాజాశ్రయ మువలన నెన్నియైన మేళ్లు చేకూఱునుగదా!" యని ప్రియా లాపములు పలుకుచున్న గోమాయు వచనములకు లోఁబడి యాగార్దభ మిట్లనెను.

"నీవు నాకు మిక్కిలి ప్రియసఖుఁడవై నాకు మేలు గూర్పఁదలపెట్టితివి. నీ వన్నమాట లన్నియు నిజము. తిండి చాలక బాధపడుచుండుట కన్న దొడ్డరాజునకు సేవకుఁ డనై యొక్కదినము జీవించినను జాలును."

ఇట్లని నమ్మకముఁ బ్రకటించియున్న యా గార్దభముం దోడుకొనిపోయి మృగరాజు ముందట నిలిపి జంబుక మిట్లనియె. "ఈతని నమ్మించి తోడి తెచ్చితిని. ప్రియభృత్యునిగాఁ జూచి యీతని మన్నింపఁదగును." అని పలికి దూరముగాఁ

దొలఁగిపోయెను. సింహమును మెలపున నా గాడిదను బట్టు కొని చంపివైచెను."

ఆ విధమున రెండవమాఱు నీకుఁ జిక్కుటకు నేను బుద్ధిలేని గాడిదను గాను. ఈపాటికి స్నేహము చాలించి ప్రియాంగన కడకు దయచేయవచ్చును." అని బలివర్ధనుఁడు పలుకఁగాఁ జింతాక్రాంతుఁడయి సిగ్గుపడుచుఁ గ్రకచుఁడు జలమధ్య మునకుఁ బోయెను. కావున మనము మెలఁకువ గలిగి వర్తింపక యుద్ధమే ముఖ్యమని యెంచిన విజయ మపజయ ముగా మాఱి లబ్ధనాశము సంభవింపవచ్చును.

"ధర్మముఁ దలపోసి రాజునకుఁ బ్రియమా, యప్రి యమా? యని యాలోచింపక సత్యవాక్కులు కొంచెము పరుషముగా నున్నను జెప్పఁగలిగినవాఁడే యుత్తముఁడు. అట్టివాఁడే రాజునకు నిజమైన మిత్రుఁడు. మిత్రులను, సేనను రాజ్యమును, దన్ను, కీర్తిని యుద్ధమునకు సిద్ధపడి సందేహడోలి కయందుఁ బడద్రోయ వివేకవంతుఁ డెవఁడు తలపోయును?" నావుడుఁ జిత్రవర్ణుఁ 'డట్లైన ముందే యేల యీసంగతిఁ జెప్ప వైతి' వని యడిగెను.

దానికి మంత్రి నామాట నీవు తుదివఱకు వినవైతివి గాదా! అపుడైన నీ యుద్ధారంభమునకు నేను సమ్మతింపలేదు. అది యటుండనిమ్ము. ఈ హంసల రాజగు హిరణ్యగర్భుడు సంధిజేసికొనఁదగు సకల సుగుణములు గలవాఁడు. కాని విరోధింపఁదగినవాఁడు కాఁడు.

ఇట్లు దూతయగు బకము చెప్పఁగా విని చక్రవాకము నీ వికవెడలుము. అనంతర విషయములు దెలిసికొని మరల రావచ్చు' నని యాతని బంపించి హిరణ్యగర్భునితో నిట్లనెను.

"రాజా! మనమిపుడు సంధి గావించుకొనుటయే యుక్తము. శత్రుమంత్రి గ్రద్ద చెప్పిన దిదియే కదా! జయగర్వమున నాతఁడు వెంటనే మంత్రిమాటలు మన్నింపకపోవచ్చును.

మహాబలవంతుఁడు, సింహళద్వీపాధిపతియు నగు సారసము మనమిత్రుఁడుగదా! ఆతనికి జంబూద్వీపముపై గోపము కలిగింపఁవలయును. బలవంతులతోఁజేరి సంచరించుచు శత్రువులకుఁ బీడకలిగింపవలయును. బలవంతులచే నట్లు పీడింపఁబడిన శత్రువు తనచే విజితులైనవారితోనైన సంధిఁజేసికొనుట కీయకొనును. నావుడు రాజహంస యామాటల కంగీకరించి విచిత్రమను పేరుగల బకముననొక రహస్యలేఖ వ్రాసియిచ్చి సింహళద్వీపమునకుఁ బంపెను.

అచట దీర్ఘదర్శి చిత్రవర్ణునితో మరల నిట్లు పలికెను. "ప్రభూ! మేఘవర్ణుఁ డచటఁ జాలకాల ముండెను గదా! రాజహంస సంధిచేసికొనఁదగు సుగుణములు కలవాఁడైనదియుఁ గానిదియు నాతఁ డెఱుంగును. నావుడు రాజాతనిఁ బిలిచి "హిరణ్యగర్భుఁ డెట్టివాఁడు? ఆతని మంత్రి చక్రవాకము స్వభావము నేపాటిది?" యని ప్రశ్నింప వాయసము హిరణ్య 'గర్భుడు ధర్మరాజునకు సాటివచ్చు గుణవంతుఁడు. చక్రవాక

మునకు సాటిరాఁదగు మంత్రులు లోకమున నరుదు' నావుడు మయూర మిటు లనియె.

'అంతటి సమర్థులైనచో నీవారాజు నెటులు వంచింపఁ గలిగితివి ?' అను ప్రశ్నకు వాయసము నవ్వి యిటులనియె. 'ప్రభూ ! నమ్మినవారిని వంచించుటలో విశేషమేమి కలదు ? ఒడిలో సుఖ నిద్రగాంచిన వానిఁజంపుటయు నొక పౌరుషమే యగునా ? చక్రవాకమంత్రి నన్నుఁ జూచిచూడకుండఁ గనే కనిపెట్టెను. కాని యాశ్రితవత్సలుఁడగు నారాజు తని మాటలు వినక నన్ను నమ్ముటవలన నేను వంచింపఁ గలిగితిని. తనవలెనే యెదుటివారును నిష్కపటులని నమ్మువారు ధూర్తులచే మోస గింపబడిన బ్రాహ్మణునివలెఁ జెడిపోవుదురు. నీ కాకథ వివరించెదను; వినుము.

ధూర్తులచే వంచింపఁబడి యజ్ఞమేషమును వదలుకొన్న బ్రాహ్మణుని కథ

గౌతమారణ్యమందలి యొక విప్రుఁడు యాగముచేయఁ గోరి గ్రామాంతరమునకుఁబోయి యొక్క ఛాగమును గొనెను. దాని నాతఁడు బుజముపై నిడుకొని తీసికొనిపోవుచుండ ముగ్గురు తుంటరులుచూచిరి. ఈఛాగముమిక్కిలి బలిసియున్నది.దీని నే యుపాయముననయిన నపహరింపఁ గలిగినచోఁ జక్కఁగాఁ దిన వచ్చును. అని యాలోచించి యాబ్రాహ్మణుని మార్గమున

ముప్వురు మూడుస్థలముల దూరముగా నిలిచి యాతని రాక కెదురు చూచుచుండిరి.

అందొక ధూర్తునియొద్దకు బ్రాహ్మణుఁడు రాఁగా నాఁతడు వినయము మెఱయ "బ్రాహ్మణోత్తమా! సర్వము దెలిసిన మీరీ కుక్కను బుజము నెక్కించికొనుట న్యాయమా?" యని ప్రశ్నించెను. అపుడు విప్రుఁడు "ఛీమూర్ఖుఁడా! యాగచ్ఛాగమును కుక్కయనుటకు నోరెట్లువచ్చె" నని యాతని ధిక్కరించి ముందునకుఁబోఁగా రెండవధూర్తుఁడును నాశ్చర్యము బ్రకటించుచుఁ 'బరమపవిత్రులగు బ్రాహ్మణులు కుక్కనుమోసికొనిపోవుట ఘోర' మని యాబాపనితోఁ బలికెను.

అపు డావిప్రుఁడు కొంచెము సంశయించి మేక నొకసారి క్రిందికి దింపి పరిశీలించిచూచి 'కుక్క కా' దనుకొని మరల బుజముపై నుంచుకొని పయనము సాగించెను. దుష్టుల వాక్యములు విన్న వివేకవంతులకును నొకపుడు నిజముగా మతిచలించును. అట్టిమాటలను నమ్మియొకపుడు చిత్రకర్ణునివలె మరణముగూడ నొందఁ గలరు. నీకాకథ తెలుపుదును వినుము.

దుష్టుల మాటలువిని, నమ్మిచెడిన లొట్టియ కథ

ఒక వనమందు మదోత్కటమను సింహము నివసించుచుండెను. దానికిఁ గాక వ్యాఘ్రజంబుకములు ముప్వురనుచరులు. వారు వనమునఁ దిరుగుచు సార్థమునుండి తప్పిన యొంటె

నొకదానిం జూచి 'నీ వెచటినుండి వచ్చితి?' వని యడుగ నది తన వృత్తాంతము వివరించెను. వారు దానిని సింహామునొద్దకుఁ గొనిపోయి దర్శనము చేయింప సింహాము దానికభయమిచ్చి, చిత్రకర్ణుఁ డని పేరిడి తన పరివారమున నుండ నియమించెను.

ఇటులుండఁ గొన్ని దినములైన పిమ్మట నొకనాఁడు సింహామునకు శరీరమున ననారోగ్యము కలిగి, వేటకుఁ బోవలేక పోయెను. అందు లన నెవ్వరికి నాహారము దొరకలేదు. అపుడు కాక వ్యాఘ్రజంబుకములు రహస్యమున నిటు లాలోచించెను.

'ఈచిత్రకర్ణుని మనరాజు చంపునటులు చూడవలయును. కంటకాదులఁ దిను నీతని వలన నుపయోగ మేమికలదు?' అని కాకము పలుక, వ్యాఘ్రము 'మన ప్రభు వీతని ననుగ్రహించి యభయమిచ్చి స్నేహాముతో నుండగా నీతని జంపించుట యెట్లు సాధ్యమగు' నని ప్రశ్నించెను. దానికి కాకమిటులు పలికెను. "మన ప్రభు విపు డాహారములేమిఁ గృశించి యున్నాఁడు. తిండికొఱకెట్టి పాపమునకైన నొడిగట్టఁ గలఁడు. ఆకలి గొనియున్న స్త్రీ తన పుత్రునైన విడిచి వైచును. ఆకలిగొని పాము తన యండములనే భక్షించును. క్షుధార్తులయిన నరులు కరుణాహీనులై ఏపనినైనఁ జేయుదురు."

ఆమాటల ప్రకార మంగీకరించి యవి సింహాము దగ్గఱకు వెడలెను. సింహామువానిం జూచి 'యాహారమేమైన

దొరకెనా!' యని యడుగఁ "ప్రభూ! అల్పులమగు మే మెంత యత్నించినను గొంచెమైన దొరకలేదు. నాఁడుడు 'నీకఁబ్రదుకుట కేమిమార్గ' మని సింహ మడుగ 'స్వవశమందున్న యాహార మును విసర్జించుట చేత నీవిధముగ సర్వనాశన పరిస్థితి సంభ వించినది' అని కాకమనెను. 'స్వాధీనమైన యాహారమేమి కల' దని సింహ మాశ్చర్యముతో నడుగఁ గాకి 'చిత్రకర్ణుఁడే యా యాహార' మని పలికెను.

దానికి సింహము చెవులు మూసికొని "ఈతనికి నే నభయమిచ్చి చేరఁదీసితిని. భూదానము కాని, సువర్ణ దానము గాని, గోదానాన్నదానములుకాని యాభయ ప్రదానమునకు సాటిగావు. అట్టి యభయ దానము నెట్లు భంగపుచ్చఁగలను? సర్వకామములు నొసఁగు నశ్వమేధయాగముకంటె శరణు జొచ్చిన వారినిఁ గాపాడిన నెక్కువ ఫలము గలుగును." అనెను. సింహము మాటలకు మరలఁ గాకమిట్లు పలికెను.

"ఈతని మీరు చంపనక్కఱలేదు. ఆతడు తన దేహ మును తనంతటఁ దానొసఁగునట్లు మేము చేయఁగలము" నావుడు సింహమేమియు బదులుపలుకఁ జాలక యూరకుండెను. అది యవకాశముగాఁగొని కాకము వ్యాఘ్రజంబుకములతో నొక కుట్ర పన్నెను.

లొట్టియకడ కేఁగి కబురులుచెప్పి దానితో నామూఁడును సింహముదగ్గఱకు జేరెను. అపుడు కాకము "ప్రభూ! మేమెంత

యత్నించిన నించుకేని యాహారము దొఱకదయ్యె. మీరా బహుదినములనుండి యుపవాసమున మిక్కిలి డస్సియున్నవారు. కావున నిపుడు నామాంసము స్వీకరించి కొంతయాకలి దీర్చుకొనుఁడు. మంత్రులకుఁ బ్రజావర్గమంతటికిఁ బ్రభువే మూలము. నరులకు సమూలములయిన తరువులేకదా ఫలము లొసంగఁ గలవు!" అని వినయముమెఱయఁ బలికెను.

దానికి సింహము "ఇట్టి మహాపాపముఁజేసి జీవించుటకన్న ప్రాణములు గోలుపోవుట మిక్కిలి శ్రేయస్కరము." నావుడు జంబుకమును నటులే 'నాదేహ మాహారముగాఁ గొను'మని ప్రార్థేయపడెను. సింహము దానికి నంగీకరింపలేదు. అనంతరము వ్యాఘ్రముకూడ 'నాదేహము నుపయోగింపు' మని సింహమును గోర 'నదియెంతమాత్ర ముచితముగా' దని సింహ మనెను.

పిమ్మట నెక్కుడు నమ్మకము కలిగి చిత్రకర్ణుఁడును 'దప్పక నా దేహము భక్షించి యాకలిఁ బాపుకొను' మని సింహమును వేఁడికొనెను. ఆపలుకులు విన్నతోడనె సింహము దానిపైనుఱికి దానియుదరముం జీల్చివైచెను. సింహము తినఁగా మిగిలిన యాహారమును దృప్తితీర కాకవ్యాఘ్రజంబుకములు భుజించెను. కావున దుష్టవాక్కు లసత్యములైనను గొంత నమ్మకమో, సంశయమో కలిగింపకమానవు. పిమ్మట మూఁడవ తుంటరి బ్రాహ్మణుని సమీపించి "స్వామీ!

మీవంటి యుత్తములిట్టి నీచపుఁ బనిచేయుట యేటి న్యాయ”
మని ప్రశ్నించెను.

ఆపలుకులు విని బ్రాహ్మణుఁడు “నిజముగా నాకు మతి చెడినది. లేకున్న నందఱుఁ గుక్కయని పలుకుచుండ దానిని మేఁకయని యెట్లు నమ్మెదను? ఎవఁడో దుష్టుఁడు నాకీ కుక్కను మేఁకయని యంటఁగట్టినాఁడు” అని యాలోచించి యిఁక బుజముపై నున్న దానివంకఁ జూడకయే దాని నచట దిగవిడిచి, స్నానముచేసి యింటికిఁబోయి కుక్కను ముట్టు కొన్నదోషముఁ బరిహరించు కొనుటకు గాయత్రిని జపించు కొనెను. ఆతుంటరులు తమనేర్పునకు మిక్కిలి సంతసించి మేఁకను గొనిపోయి కోసికొని మాంసముం బంచుకొని తినిరి. కావున నుత్తముఁడైనవాఁ డందఱు తనవలె యోగ్యులే యని నమ్మఁజనదు.”

అదియంతయు విని మయూరరాజు మేఘవర్ణునితో ‘నీవు శత్రుమధ్యమునఁ జిరకాలము వారిని నమ్మించి యెట్లు వసింపగలిగితి’ వని ప్రశ్నించెను. మేఘవర్ణుఁడు నిట్లు బదులు పలికెను. “స్వామికార్యము నిమిత్తముకాని, స్వప్రయోజనము కొఱకుగాని చేయరాని పనియుండునే? మానవులు వంట వండుకొనుటకయి కట్టెలు దలపై నిడికొని మోయుచున్నారు గదా! వృక్షములఁ బడగొట్టుటకై నదీవేగము వృక్షపాద ములు గడుగుచున్నదికదా! బుద్ధిమంతుఁడు శత్రువును శిర

మునఁ దాల్చియైనను గార్యసిద్ధి నందఁ జూచును. కార్యసిద్ధికై కప్పలను మోచిన సర్పముకథ యొండుకలదు. నీకు దానిని వివరింతును వినుము.

కార్యసిద్ధి నిమిత్తము కప్పలను మోచిన సర్పము కథ

ఒక పాడువడిన యుద్యానవనమున వృద్ధసర్ప మొండు నివసించుచుండెను. దానికి మందవిషమని పేరు. అది మిక్కిలి ముదిసి యుండుటవలన నాహారము వెదకుటకైన శక్తిలేక యొక చెఱువు దగ్గఱఁ బడియుండెను. దానిం జూచి దూరముననుండి మండూకమొకటి "నీ వాహారము వెదకుకొనక యేల యిట్లు పడియుంటి" వని యడుగ నాసర్పము "మందభాగ్యుఁడ నగు నన్నుఁ బలుకరించిన నీకు లాభమేమి? నీత్రోవను నీవు పొ"మ్మని పలికెను. దానితో నాకప్పకు దాని వృత్తాంత మెఱుంగ మిక్కిలి కౌతుకము పొడమి సర్పమును బలవంతపెట్ట నది యిట్లు చెప్పఁదొడఁగెను. "ఓయీ వినుము. బ్రహ్మపురవాసియు, మిక్కిలి శ్రోత్రియుఁడు నగు కౌండిన్యుని పుత్రుఁడు సకలసుగుణసంపన్నుఁడు, నిరువది వత్సరముల వయసు వాఁడుఁ దైవవశమున నడవిలో దిరుగుచుండ నేను చూచి ఘాతుకస్వభావముచే వానిఁ గఱచితిని. సుశీలుఁడను పేరుగల యూ బాలుఁడు వెంటనే మరణించెను. కుమారుఁడు మరణించుట చూచి కౌండిన్యుఁడు దుఃఖభారముచే మూర్ఛనొంది నేలపైఁబడి దొరలెను.

ఆపురమందలి బ్రాహ్మణులందఱు నావార్తవిని యచటఁ జేరిరి. అది యుచితము కదా! ఉత్సవ సమయమునను, దుఃఖ కాలమునను, యుద్ధమందును, కఱవుకాలమునను, విప్లవము జరుగునపుడును, రాజద్వారమందును, మరణకాలమునను నెవ్వఁడు దరిజేరునో వాఁడే నిజమగు బందుగుఁడు.

అపుడు కపిలుఁ డను నొక గృహస్థుఁడు “ఓయీ కౌండిన్యా! వివేకము లేమింజేసి యిట్లుదుఃఖించు చున్నావు. జన్మ కలిగినపుడే మరణ మందఱకు వ్రాసిపెట్టఁ బడియుండ విచారమునకుఁ గారణ మేమి కలదు? సకల యోధులతోఁ గూడిన నరపాలు లందఱు నిపు డుండిరా? ఎందఱెందరో యెడఁ బాటునొందియున్నట్లే భూమి నిలిచియుండి సాక్ష్యమిచ్చుటలేదా? శరీరమునకు క్షణక్షణము నపాయము పొంచి యుండును. సంపదలాపదలకు మూలము. కలయిక లెడఁ బాటునకు హేతువులు. జనించిన దంతయు నశింపకతప్పదు. మంటికుండ నీటిలోఁబెట్టినచోఁ గరగి పోవునటులు శరీరము క్షణక్షణము నాయువు తఱుగుటచేత క్షీణించిపోవు చున్నదని మానవు లెఱుంగఁజాలకున్నారు. ప్రతిదినము మృత్యుదేవత మనలను మరణశిక్షనొంది వధ్యస్థానమునకుఁ గొంపోఁబడువానినివలె సమీపించుచున్నది. యౌవనము, రూపము, సంపదలు, జీవితము, ప్రియుల పరిచయము నివియన్నియు ననిత్యములు. కావున వీనిపైఁ బండితుఁడు తగులాటము వహింపఁడు. మహా

ప్రవాహమున రెండు దుంగలు కొట్టుకొనిపోవుచు నొకమారు కలిసికొని యట్టె విడిపోవుచుండునట్లు మానవులు నొకమారు గలిసికొనుచుందురు. అట్లే విడిపోవుచు నుందురు. మఱియు నొక బాటసారి యలసి కొంతసే పొక చెట్టునీడను బరుండి విశ్రమించి వెడలిపోవును. అట్లే ప్రాణియు నొకచోట జనించి పని తీరిన వెంటనే వెడలిపోవును. ఈ శరీరము పంచభూతముల సమ్మేళనమునుండి జనించినది. మరల విడి పంచభూతములఁ గలియుచున్నది. దీనికై విచారించుట యవివేకము. ప్రాణి బంధువర్గముతో నెన్నివిధముల సంపర్క మేర్పఱచుకొను చున్నాఁడో యన్నివిధముల హృదయమున శోకశంకువులు నాటుకొనుచున్నవాఁడే యగుచున్నాఁడు. అపథ్యభోజనము వలె ప్రియసమాగమములు తాత్కాలికానందము గలిగించి నను మనకవి యతిదారుణములై పరిణమించును. నదీప్రవాహ ములు ముందునకే కాని వెనుకకు మరలనట్లు రేలుంబవళులు మానవుల యాయువును దీసికొని ముందునకు బోవుచునే యుండును. వియోగమను కత్తితోఁ గోయఁబడిన మానసమున క్షేమందును బనికిరాదు. కావుననే సత్సంగమునైనను విబుధులు కాంక్షింపరు. సగరాది చక్రవర్తు లెంతటిపుణ్యము లొనరించినను వారికిని మరణము తప్పలేదు. నరలోకమున జనించుటకు గర్భములోఁ బడినది మొదలు ప్రాణులు మృత్యువు నొద్దకు విరామము లేక పయనించుచునే యుండును. కావున

నవివేకమూలమగు విచార ముడిగి సంసారముఁ జూచికొనుము.” అని యుదేపశించెను.

ఆ మాటలు విని, నిద్ర మేలుకొన్నవానివలెఁ గౌండిన్యుఁడు లేచి యిటు లనెను.

“నా కిఁక నీగృహనరకము చాలును. వనవాసము నకుఁ బోవుదును” అది విని కపిలుఁడు “రాగముతోఁ గూడిన వారికి వనమునన్నైనఁ గష్టములు రాకమానవు. గృహమం దుండియుఁ బంచేంద్రియములఁ గట్టుదిట్టము చేసికొన్నదియే తపస్సగును. రాగములేనివాఁడై; కుత్సితకర్మలలో నడచుకొనని వానికి గృహమే తపోవనము. ఏ యాశ్రమమందున్నను ఎట్టి దుఃఖము నొందినను ధర్మమును విడువరాదు. సకలప్రాణుల యందును సముఁడై యుండవలయును. ఆశ్రమము ధర్మకార ణము కాఁజాలదు. బ్రదుకుట కొఱకు మాత్రము తిండియు, సత్సంతానము కొఱకు మాత్రము సంసారమును, సత్యమా డుట కుపయోగింపఁబడు వాక్కును నెవరికుండునో వారు కోటలనైన దాటఁగలరు.

“ఆత్మయే నది. ఇంద్రియనిగ్రహమే పుణ్యతీర్థములు. సత్యమే జలము. శీలమే గట్టులు. దయ కెరటములు. అట్టి యాత్మనదియందు మునిఁగిననే మానసము పరిశుద్ధి నొందును గాని నదీస్నానము లెన్ని చేసినను లాభములేదు. జన్మమును మరణము, వ్యాధి, వేదన మున్నగు నుపద్రవములతో గూడిన

సంసారము విడిచిన వానికి సుఖముగలుగు" ననఁ, గౌండిన్యుఁ డామాటల కామోదముఁ జూపెను. కాని "నేఁడు మొదలు కప్పలను మోయు" మని నన్ను శపించెను.

కంపిజలుడు "నీ విప్పుఁడు క్రోధముచే సహనములేక యుంటివి. ఎవరితోను స్నేహము పెట్టుకొనరాదు. అట్లుండ లేకపోయినచో మంచివారితో మాత్రముమైత్రి చేయఁదగును. అందలి దోసమును కదియేమందు." నావుఁడు గౌండిన్యుడు "యథావిధిగా సన్న్యాసముఁ దీసికొనెను. నాఁటినుండి యీ బ్రాహ్మణ శాపవశమున గప్పల మోయుటకై యిట నున్నాఁడ" నని సర్పము పలికిన మాటలు విని యాముదుసలి కప్ప తమ ప్రభువగు జాలపాదునొద్ద కేఁగి యీ సంగతి దెలిపెను.

అంతట జాలపాదుఁడు సర్పము దగ్గఱకువచ్చి దాని వీపుమీఁది కెక్కెను. పాము దానిని మెచ్చికొని విచిత్రమగు రీతుల నడిచెను. మరునాఁడు కదలలేకుండ నున్న యాసర్పమును గాంచి మండూకరాజు "నీవిప్పుడు బాగుగా నడుచుటలే దే" మని యడుగ నది 'తిండి లేనందున బలహీనముగా నుంటి' ననెను. 'నీయాకలికి సరిపడునట్లు మండుకములఁ దిని చక్కఁగా మోయుచుండు' మని రాజాజ్ఞాపించెను. మహా ప్రసాదమని పలికి నాటినుండియు దినదినము వలయునన్ని కప్పలఁ దినుచుఁ గొంతకాలమునకుఁ గప్పలన్నియుఁ జెల్లిపోఁగా

నాసర్పము తుదకు మండూకరాజును గూడ భక్షించెను. కావున స్వామికార్యార్థ మెట్టి యిడుమలనైన భరించుట కష్టముకాదు. ఇపు డాసంగతులు చర్చించి ప్రయోజనము లేదు. హిరణ్యగర్భుఁడు సకల విధముల సంధికిఁ దగినవాఁడు. నాయభిప్రాయ మిది" యని మేఘవర్ణుఁడు వివరించెను.

చిత్రవర్ణుఁడన్నియు విని "నీ కీవిచారమేల? ఆతఁడు నాచే జయింపబడిన కారణమున నాకు సేవచేయుట కంగీకరింపవల యును. లేదేని విగ్రహము తప్ప" దని పలుకుచుండగా జంబూ ద్వీపము నుండి చిలుకవచ్చి యిటు లనెను.

"ప్రభూ సింహళదేశమున కధిపతియగు సారసరాజ జీవుడు జంబూద్వీపమును ముట్టడించి యున్నాఁడు" ఇట్లు చెప్పఁగాఁ గంగారుపడి 'ఏమైనది చెప్పుచెప్పు'మని రాజు తొం దరపెట్టఁగాఁ జిలుక మొదటివలెనే మరలఁ బలికెను.

గ్రద్ద తనలో "ఓ చక్రవాకమంత్రీ! సర్వజ్ఞా! లెస్సయైన పనిచేసితివి" అని తలపోయుచుండెను. 'సరే! కానిండు. అచటికే వెడలి వానిని సమూలముగ నిర్మూలింపఁ గల' నని రాజు పలుక దూరదర్శి నవ్వి యిటులనియె. "శరత్కాలమేఘ ముఱిమినట్లు వృథాగా గర్జింపరాదు. మహాపురుషులైన వారు పరులకుఁ దమమనసులోని యర్థానర్థములు వెల్లడింపరు. మఱియు నొకేసారి పదిమందితో యుద్ధము పెట్టుకొనరాదు.

"బలవంతమైన సర్పము చలిచీమలచేత జిక్కి చావదె ?' కావున సీతనితో సంధిచేసికొని మఱియేగుట మంచిది. కాకున్న మన వెనుకనే యాతఁడు విజృంభింపవచ్చును. కేవలము గోపమునకు లోఁగి యథార్థమెఱుఁగకుండువాఁడు పరాభవమొంది పశ్చాత్తాప పడవలసివచ్చును.

కామము, క్రోధము, లోభము, మోహము, గర్వము, అసూయ యనునవి మానవునకు శత్రువుల వంటివి. ఇవియే అరిషడ్వర్గ మనఁబడును. వీనిని విడువ గలిగిన నరుఁడు తప్పక సుఖమొందఁగలఁడు" అను మంత్రిపలుకులకు రాజు "ఆర్యా! ఇది మీనిశ్చయము." నాపుడు మంత్రిమరల నిట్లు పలికెను "అవును పరమార్థము స్మరించుటయు, మంచిచెడ్డల తర్కమును, వివేకము తోడి నిశ్చయము, రహస్య గోపనము, దృఢబుద్ధి- ఇవి మంత్రికుండఁదగు ముఖ్యగుణములు. మఱియు నేపనియుఁ దొందరపడి చేయరాదు. దూరాలోచన లేకున్న నాపదలు తప్పవు. యుక్తాయుక్తములు గుఱితించి పనిచేయువానిని సంపదలు వాని గుణములపట్ల నాదరముగలవై స్వయముగా వరించును. వేయేల ప్రభూ ! నామాటలయం దేమైనఁ దమకు గౌరవ మున్నచోఁ దప్పకసంధి గావించుకొని వెడలుట మేలు. కార్యసాధనమునకు నాలు గుపాయములు. శాస్త్రములలోఁ జెప్పఁబడి యున్నను గడమవి మూఁడును కేవలము నామమాత్రములు. కార్యసిద్ధి ముఖ్యముగా సామము నాశ్రయించి యుండును. ఇంకను విశేష మేమన నీరాజహంస ధర్మజ్ఞుఁడు.

ఆతని మంత్రి సర్వజ్ఞుఁడు. మేఘవర్ణుని మాటలవలన, నాతఁడొనరించిన పనులను బట్టియు నీవిషయము స్పష్టమగుచున్నది.” అను మంత్రిమాట లాలించిరాజు “ఆర్యా! ఇకఁ జర్చ్యయవసరములేదు. నీమనసునకు వచ్చినట్లుగావింపుము. నావుడు మంత్రి ‘సరే! ఉచితరీతి నాచరింత’మని పలికెను.

రాజు, మంత్రియుఁ దమ తావులకుఁ బోవఁగా నావిషయమును గమనించిన గూఢచారియగు కొంగ హిరణ్యగర్భునొద్దకు సత్వరముగా వచ్చి “ప్రభూ! సంధి సమకూర్చుటకై మహామంత్రి గృధ్రము మన సమ్ముఖమునకు వచ్చుచున్నాఁ” డని తెలిపెను. అపుడు రాజహంస తనమంత్రితోఁ మరల నేదైన గపటము పన్నఁదలఁచి వచ్చుట లేదుగదా” యన మంత్రియగు సర్వజ్ఞుఁ డిటు లనియెను.

“ప్రభూ! ఈవిషయము సందేహింపఁదగ్గదికాదు. ఏలన దూరదర్శి గొప్పయాశయము గలవాఁడు. ఒకపుడు గొంచెమైన ననుమానింపకయుండుటయు, వేఱొకపు డన్నిఁటియందు సంశయించుటయు నను నవి మందమతుల లక్షణములు. రాత్రి నక్షత్రములు సరసులోఁ బ్రతి ఫలించినపుడు, హంస యవి తెల్లదామరలని భావించి వానిఁజేరఁబోయి తాను వంచింపఁబడినట్లు క్షణములోఁ దెలిసికొనును. ఆహంస పవలు చెఱువులోని తెల్లదామరలను జూచి యవి నక్షత్ర ప్రతిబింబములుగా భావించి వానిఁగొఱుకక దలఁపక విడుచును. అట్లే వివేక హీనుఁ డసమ

యమునను సందేహించు. సందేహాస్పదమగు విషయము వెంటనే నమ్మును. దుర్జనులవలనఁ గలఁతనొందిన మనసు గలవాఁడు సుజనులనుగూడ నమ్మక పోవును. పాయసము దినఁబోయి చేయి కాలిన బాలుఁడు పెరుగును గూడ నూదికొని తినును.

కావున నో ప్రభూ! ఆతని గౌరవించు నిమిత్తము రత్నాదికములగు కానుకలు సిద్ధపఱుపవలయును." నావుడు రాజందులకుఁ దగు నేర్పాటులుగావించెను. మంత్రి చక్రవాకముదుర్గ ద్వారమునొద్ద కెదురేఁగి గృధ్రమును సత్కరించి తీసికొని వచ్చి రాజదర్శనము చేయించెను. గృధ్రమును రాజునకు వందనము చేసి యాతని యనుమతిపై నుచితాసన మలంకరించిన యనంతరము చక్రవాక మిటు లనియె.

'ఈరాజ్యమంతయునుమీాయదియకాభావించి స్వేచ్ఛగా ననుభవింపుఁ' డన రాజహంసయు నటులే పలికెను. 'దూరదర్శి యామాటల కిటులు బదులు పలికెను. మీావచనము లుత్తములకుఁ దగినటు లున్నవి. లుబ్ధుని ధనముచేతను, సాధుపురుషుని నమస్కారమాత్రము చేతను, మూర్ఖుని మాటకుఁ గాదనక యూరకుండుటచేతను, దత్త్వార్థముచేఁ బండితుని వశపఱచుకోవచ్చును. సద్భావముతో మిత్రుని, నుత్సవములచే బంధువులను, దానమానములచే స్త్రీలను, భృత్యులను దయచే నితర జనులను నాకర్షింపవచ్చును. కావున నాతనితో నిపుడు సంధి చేసికొనుట మేలు. రాజు చిత్రవర్ణుడు మహాప్రతాపవంతుఁడు"

నావుడు రాజహంసఁ మంత్రి చక్రవాకము "సంధిచేసికొను మార్గమును గూడ సెలవిండు" అని పలికెను. రాజహంస 'సంధి ప్రకారము లెన్ని?' యని యడిగెను. దానికి గృధ్ర మిటులు పలికెను.

"బలవంతుఁడు దాడి చేసినపుడు ప్రతిక్రియ సాధ్యము గానిచోఁ గాలయాపనకొఱకు సంధిచేసికొనవలయును. కపాలము ఉపహారము, సంతానము, సంగతము, ఉపన్యాసము ప్రతీకారము, సంయోగము, పురుషాంతరము, అదృష్టనరము ఆదిష్టము, ఆత్మాదిష్టము, ఉపగ్రహము, పరిక్రియము, ఉచ్ఛిన్నము, పరభూషణము, స్కంధోపనేయము నని సంధి పదునారు రకములు.

సమమైన తాహతుగలవారు చేసికొన్నది కపాలసంధి యనఁబడును. ధనమొసఁగి కూర్చుకొనుసంధి యుపహారమనఁబడును. కొమార్తెల నొసఁగి చేసికొనుసంధి సంతాన సంధి. సత్పురుషులతో స్నేహపూర్వకముగా జేసికొనునది సంగతసంధి.

ఈసంగతసంధి యుత్తమము. జీవితాంతమువఱకుండునది. ఆపదలందు, సంపదలందు సమానార్థ ప్రయోజనములు గలిగి యేకారణముల వలనను తెగిపోక యీసంధి చక్కఁగా నదుకఁబడిన సువర్ణమువలెఁ బ్రకాశించును.

తనకార్యసిద్ధి కొఱకుఁ జేసికొనుసంధి యుపన్యాస మనఁబడును. నేనిదివఱ కీతని కుపకారముచేసితిని. ఈతఁడు మరల

నాకుపకరించునని చేసికొనుసంధి ప్రతీకార మన నొప్పును. రామ సుగ్రీవులసంధి యిట్టిదే. ఏకప్రయోజనము గలక్రియ నుద్దేశించి చేసికొనఁబడు సంధి సంయోగ మనఁబడును. 'మన యోధుల మూలమున మన మీయర్థము సాధించుకొంద' మని పణము నిర్దేశించు కొనఁబడిన సంధి పురుషాంతరము నాఁబడు. నీయొక్కని చేతనే నాపని సాధింపఁ బడవలయునని శత్రువు పణమిడి చేసికొన్న సంధి పేర దృష్ట పురుషాంతరము.

భూమిలోఁ గొంతభాగము పణముగానిచ్చి చేసికొన్న సంధి యాదిష్టమనఁదగు. స్వసైన్యముచేఁ జేసికొనఁ బడినది ఉదాహృతము. ప్రాణరక్షణముగోరి, సర్వస్వము నొసఁగి చేసికొనుసంధి యుపగ్రహము. కోశములో నొకభాగము గాని, యర్ధకోశము గాని, సర్వకోశము గాని యొసఁగి శిష్టరక్షణ మునకై చేసికొనుసంధి పరిక్రమ్య మను పేరఁబరగును. సార వంతములగు పొలములొసఁగి కావించుకొనుసంధి కుచ్ఛిన్న మని పేరు. భూమిలోఁ బండు పంటయంతయు నొసఁగి చేసికొనునది పరభూషణసంధి. ఫలించినదానిలో భాగమిచ్చి చేసికొనుసంధి స్కంధోపనేయము'' అని ఇట్లు సంధిభేదములు వివరింప రా జిటు లనియె.

" ఈఁతడు మిత్రుఁ డాతఁడు శత్రుఁడని యల్పులు దలఁ తురు. ఉదారచరితులగువారు వసుధయంతయు నొకేకుటుంబ మని నమ్ముదురు. పరవనితలయందు మాతృభావము, పర

ద్రవ్యమందులోష్ఠబుద్ధి, సర్వభూతములందాత్మభావన గలుగు వాఁడే పండితుఁడు. మీరు మహానుభావులును బండితులును. కావున మే మేమిచేయవలయునో యూనతిండు.” నావుడు గృధ్ర మిట్లనెను.

“ఆధివ్యాధులచేఁ బీడితమై నేఁడో, రేపో నశించు శరీరము నిమిత్తము ధర్మము దప్పుట కెవ్వఁ డోపును. ప్రాణుల జీవితము కదలుచున్న నీటిలోని చంద్రునివలె గడు జపలము. ఈసంగతి గుర్తించి యనుక్షణము ధర్మమాచరింపవలయును. సంసార మెండమావులఁ బోలె క్షణభంగుర మని యెఱిగి; ధర్మముకొఱకు, సౌఖ్యముకొఱకు, సుజనులతో స్నేహము చేయవలయును. కావున నాయభీష్టము వినుఁడు.

‘వేయియశ్వమేధములు’ నొక్కసత్యము వేఱు సిబ్బెల లో నిడి తూఁచిన సత్యమే యధికముగ నుండెను. కావున సత్య మను దివ్యమను బురస్కరించుకొని యుపహారమనుసంధిఁ జేసి కొనుట యుక్తము’ నావుడు సర్వజ్ఞుఁడును దాని కంగీకరించెను.

రాజపుడు వస్త్రాద్యలంకారములు కానుకగానిడి పూజింప మిక్కిలి సంతసించి గృధ్రము తనతో సర్వజ్ఞునిఁ దోడుకొని పోయి మయూరరాజదర్శనము చేయించెను. చిత్రవర్ణుఁడును గ్రద్దమాటలువిని సర్వజ్ఞుని మిగుల నాదరించి సంధి నంగీక రించి పంపెను. అనంతరము దూరదర్శి “ప్రభూ! నేఁటికి మన కోరిక నెఱవేఱినది. ఇపుడు స్వస్థానమగు వింధ్యాచలమున

కేఁగుదము.” అని రాజుతోఁబలికెను. పిమ్మట నందఱు వింధ్యపర్వతమునకుఁ బోయిరి.

వారు వింధ్యగిరికిఁ జేరుటకుముందే హిరణ్యగర్భుఁడంపిన దూతలు శీఘ్రముగా నరిగి సింహళద్వీపాధిపతో “సర్వోపద్రవ కారణమైన యుద్ధము నుజ్జగించి చిత్రవర్ణునితో సంధి గావించు కొనుటయైనది. మేము కలిగించిన శ్రమకు మన్నించి మీరును సంధికొడంబడుట మంచిది. మీదండయాత్రవలన మాకు సంపూర్ణ ఫలితము చేకుఱినది. మీరిష్టపడినచోఁ జిత్రవర్ణుని మంత్రి దీర్ఘదర్శియుఁ దమరాజును దప్పక సంధికొప్పించును. ఇది మాప్రభువగు హిరణ్యగర్భుని సందేశము” అని విన్న వించిరి.

ఇదేవిధమునఁ జిత్రవర్ణుని కడనుండియు సంధికై రాయ బారము రాఁగా సింహళద్వీపాధిపతి దానికంగీకరించి, చిత్రవర్ణు నిచే సత్కరింపఁబడి తన బలములతో స్వస్థానమున కేఁగెను. ఈ విధముగా సంధిగావించుకొని యందఱానందమొందిరి.”

ఈవిధముగాఁ దెలిపి విష్ణుశర్మ “రాజకుమారులారా! ఈనీతిశాస్త్రముఁ బఠించినవారికి సకల విషయములు గరతలా మలకము లగును. అట్లు పఠింపనివారెంతటివారయ్యును గార్య సమయములందుఁ గర్తవ్యతా విమూఢులై యనర్థముం జెందుదురు. ఈవిధముగామీకు ధర్మార్థ కామసాధనములైన యనేకకథలు వినిపించితిని. కావున నిందలి నీతులు మనసునఁ

బదిలపఱచుకొని దృఢచిత్తులై రాజకార్య నిర్వాహణాదు లందు నిత్యవిజయముం గాంచి ధర్మపరిపాలనచేఁ బ్రజల కానందముఁ గూర్పఁ బూనుకొనుఁడు” అని బోధించెను.

అదివిని యారాజకుమారు లాగురునకుఁ బ్రణామములు చేసి “మహాత్మా! పరుసవేది యొకించుక తాఁకిన మాత్ర మున సకలలోహములుఁ బరిశుద్ధహేమ మయము లగును. అటులే మీవాగమృత ధారలచే మాహృదయములు మిక్కిలి పరిశుద్ధములైనవి. మాకు సంపూర్ణ నీతివివేకము గలిగినది. యని పలికి యాతనికడ రాజనీతిశాస్త్రంబు లభ్యసించుచుండిరి.

అనంతర మొకనాఁడు సుదర్శనమహారాజు విష్ణుశర్మను రావించి “ఆర్యా! మీవలనఁ గుమారు లత్యంతప్రజ్ఞాధురీణు లైరి. ఇఁకమీద నాయుధ విద్యాభ్యాసంబుఁ జేయించెదను. అనుమతి యిండు” అని పలికి, లెక్కలేని గోహిరణ్యాదికము లను విష్ణుశర్మకుఁ గానుకగా నొసఁగి సత్కరించి పంపెను.

సుదర్శనుఁడు బహుకాలము రాజ్యమేలి వాన ప్రస్థా శ్రమమునకుఁ బోయిన యనంతరము నీతివిదులగు నాతని కుమారు లనవరతము విష్ణుశర్మ బోధనలు స్మరించుకొనుచుఁ జాలకాలము సకల శ్రేయస్కరముగా రాజ్యపరిపాలనముఁ గావించిరి.

170 SEE 6-1-00 Acc. No 21207